


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 4 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 10 సెప్టెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 4 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED FROM : VISAKHAPATNAM TUES 10 SEPTEMBER 2024 PRICE : 5/- RS

*Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur*

## వర్షాలపై మొబైళ్లకు అలెర్ట్ సందేశాలు పంపండి...

**- హోంమంత్రి అనిత**



**పెన్ పవర్,విశాఖపట్నం:** మరో ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖలను హోం మంత్రి అనిత అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్రను వానలు ముంచెత్తుతుండడంతో విజయవాడ నుంచి హోంమంత్రి అనిత బయలుదేరి వెళ్లారు. కోస్తాంధ్రలోను అతి భారీ వర్షాలున్నాయన్న వాతావరణ శాఖ సమాచరం నేపథ్యంలో రాబోయే 72 గంటలు జాగ్రత్తగా ఉండాలని హోం మంత్రి సూచించారు.మరో ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖలను

వివరాలు 2లో..

## బోట్లకు లంగరు వేయకుండా కేవలం ప్లాస్టిక్ తాడుతో కట్టారు: నిమ్మల రామానాయుడు


- ప్రకాశం బ్యారేజీని బోట్లు ఢీకొన్న ఘటనలో కుట్ర కోణం బలపడుతోందన్న నిమ్మల
- బ్యారేజీని ఢీకొన్న బోట్లలో మూడు బోట్లు ఒకే యజమానికి చెందినవని వెల్లడి
- బోట్లకు ఉన్న వైసీపీ రంగులు అనుమానాలకు తావిస్తున్నాయని వ్యాఖ్య



**పెన్ పవర్,విజయవాడ :** ప్రకాశం బ్యారేజీని బోట్లు ఢీకొన్న ఘటనలో కుట్ర కోణం బలపడుతోందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్న అధికారులు కూడా ఇదే అనుమానం వ్యక్తం చేశారని చెప్పారు. బ్యారేజీని ఢీకొన్న పడవల్లోని 3 బోట్లు ఒకే యజమానికి చెందినవని... ఈ బోట్లకు లంగర్ వేయకుండా

వివరాలు 2లో..

## మళ్లీ గవర్నమెంట్ వర్సెస్ గవర్నర్



**చెన్నై, పెన్‌పవర్ సెప్టెంబర్ 9 :** తమిళనాడులో గవర్నర్‌కు, అక్కడి ప్రభుత్వానికి మధ్య వ్యవహారం ఎప్పుడూ ఉప్పు నిప్పుగానే ఉంటుంది. మరోసారి అలాంటి పరిస్థితులు ప్రారంభమయ్యాయి. గవర్నర్ సీటీ రవి టీచర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు తమిళనాడులోనే ప్రభుత్వ స్కూల్స్ పరిస్థితిపై విమర్శలు చేశారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదని పూర్తిగా వెనుకబడిపోయారని చెప్పుకొచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారిలో 75 శాతం మందికి రెండు అంకెల సంఖ్యను గుర్తించడం చేతకావడం లేదని టీచర్స్ డే కార్యక్రమంలో గవర్నర్ రవి అన్నారు. అలాగే నలభై శాతం మంది తొమ్మిది తరగతి విద్యార్థులు రెండో తరగతి

వివరాలు 2లో..

## పూరి తీరాన్ని తాకిన తుపాన్

- ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు - కోస్తాకు వాన గండం
- అల్లకల్లోలంగా సముద్రం
- కళింగపట్నం, విశాఖపట్నం, గంగవరం,
- కాకినాడ పోర్టుల్లో మూడో నంబరు హెచ్చరికలు



**పెన్ పవర్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ నేటి మధ్యాహ్నం ఒడిశాలో పూరి వద్ద తీరాన్ని తాకింది.. ఈ తీరం పూర్తిగా దాటేందుకు మూడు గంటలు పడుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీని ప్రభావంతో ఒడిశాతో పాటు ఎపిలోని ఉత్తరాంధ్ర, కోస్తా తీర ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.. తీరం వెంబడి 70 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయి.. వాయుగుండం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. గంటకు గరిష్ఠంగా 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నట్లు విశాఖ వాతావరణ కేంద్రం ముఖ్య అధికారి కేవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఈ గురువారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. కళింగపట్నం, విశాఖపట్నం, గంగవరం, కాకినాడ పోర్టుల్లో మూడో నంబరు హెచ్చరికలు జారీ చేశారు. మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం పోర్టుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు.ఈ ప్రభావంతో రాగల 48 గంటల్లో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణలో నేటి నుంచి వరుసగా మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ స్పష్టం చేసింది. హైదరాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం,

మిగతా 2లో

# అప్రమత్తంగా ఉండండి



**రెడ్ అలెర్ట్ జిల్లాల కలెక్టర్లతో సీఎం టెలీకాన్ఫరెన్స్**

**పెన్ పవర్,విజయవాడ :** ఏపీలో భారీ వర్షాలు, వరదలపై మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. బుడమేరు వరద నీటి ప్రభావం తగ్గినందున కొంత ఉపశమనం లభించిందని పేర్కొన్నారు. సాయంత్రానికి అన్ని ప్రాంతాలు వరద నుంచి బయటపడొచ్చని అంచనా వేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయచర్యలపై అధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో పరిస్థితులపైనా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సమీక్ష చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కాకినాడ, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లతో చంద్రబాబు మాట్లాడారు. వాహనాలు, వ్యక్తులు వెళ్లలేని ప్రాంతాల్లో డ్రోన్లు వినియోగించాలని ఆదేశించారు. కాల్వల్లో వరద ప్రవాహాలు, గట్ల పటిష్ఠతను డ్రోన్ల ద్వారా అంచనా వేయాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఏలేరు రిజర్వాయర్‌లోకి వచ్చే నీరు.. పంపే నీటిని బ్యాలెన్స్ చేసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ముందస్తు చర్యల వల్ల ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని సూచించారు. విజయవాడలో కొన్ని ఇళ్లు మినహా విద్యుత్ పునరుద్ధరణ పూర్తయిందని సీఎంకు అధికారులు వివరించారు. అంటువ్యాధులు ప్రబలకుండా పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని.. వైద్య శిబిరాలు కొనసాగించాలని సీఎం ఆదేశించారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా 8వ రోజు విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. కుమ్మరిపాలెం జంక్షన్, సితార సర్కిల్, చిట్టానగర్, మిల్క్ ప్రాజెక్ట్ మీదుగా జక్కంపూడి వెళ్లారు. ఆయా ప్రాంతాల్లో వరద సహాయక కార్యక్రమాలపై బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.అనంతరం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదలపై కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. బుడమేరు వాగు పొంగడానికి అక్రమాలే కారణమన్నారు. తెలంగాణలో అమలులో ఉన్న ఆపరేషన్ హైడ్రా తరహాలో చట్టాన్ని తీసుకొచ్చి బుడమేరు అక్రమాలను తొలగిస్తామని హెచ్చరించారు. కొంతమంది ఆక్రమణల కారణంగా.. లక్షలాది మంది ఇబ్బంది పడుతుంటే చూస్తూ ఊరుకోమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

## ప్రకాశం బ్యారేజ్‌కి బోట్లు ఢీ - ఇద్దరు అరెస్ట్..

- మరికొందర్ని అరెస్ట్ చేసే అవకాశం..
- కేసును వేగవంతం చేసిన అధికారులు
- కావాలనే బ్యారేజ్ ను ఢీ కొట్టించారు
- మూడు బోట్లు ప్లాస్టిక్ రోప్‌తో కట్టారు
- గొల్లపూడి నుంచి నదిలోంచి వదిలారు
- ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించిన అధికారులు



**పెన్ పవర్,విజయవాడ :** ప్రకాశం బ్యారేజీ గేట్లను బోట్లు ఢీకొట్టిన కేసులో పోలీసులు దూకుడు పెంచారు. బోట్ల యజమానులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. బ్యారేజీని ఢీకట్టడంలో కుట్ర ఉందనే కోణంలో రామ్మోహన్, ఉషాద్రిని ప్రశ్నిస్తున్నారు. కాగా, విజయవాడను వరదల అతలాకుతలం చేశాయి.. ఓవైపు బుడమేరు.. మరోవైపు కృష్ణానదిలో వరద ప్రవాహం పెరగడంతో.. విజయవాడలోని చాలా కాలనీలు వరదనీటిలో మునిగిపోయాయి.. అయితే, ఇదే సమయంలో.. కృష్ణా నదిలో బోట్లు వచ్చి.. ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టడం సంచలనంగా మారింది.. ఈ బోట్లు సృష్టించిన విధ్వంసంతో .. ప్రకాశం బ్యారేజీకి చెందిన 67, 69, 70 గేట్లు దెబ్బతిన్నాయి.. దీని కోసం ఆ గేట్లను కౌంటర్ వెయిట్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.. మరోవైపు.. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.. ఇంకో వైపు ప్రకాశం బ్యారేజీకి బోట్లు ఢీ-కొన్న ఘటనపై సీఎం చంద్రబాబుకు

మిగతా 2లో

## అబుదాబి యువరాజుతో మోదీ భేటీ

- ప్రధాని మోదీ, క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలిద్ బిన్ మహ్మద్ సమావేశం
- ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఇరు నేతల భేటీ
- ఈ సమావేశంలో దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు



**పెన్ పవర్,అబుదాబి :** అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలిద్ బిన్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాల్ రెండు రోజుల పర్యన కోసం ఆదివారం భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో హైదరాబాద్ హౌస్‌లో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరువురు నేతలు రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరిపినట్టు సమాచారం. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను బలోపేతంపై దృష్టిసారించారు. ఇక అబుదాబి యువరాజు భారత్‌కు రావడం ఇదే తొలిసారి. దీంతో ఆయన పర్యటనపై ఆసక్తి నెలకొంది. ఆయన పర్యటనపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎక్స్ (ట్విట్టర్) స్పందిస్తూ.. "భారత్, యూఏఈ మధ్య రాజకీయ, పెట్టుబడి, సాంకేతికత, విద్య, వాణిజ్యం, ఇంధనంతో పాటు వివిధ రంగాలలో

మిగతా 2లో

## రోజా రీ ఎంట్రీ...



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ తిరుపతి, సెప్టెంబర్ 9:** మాజీ మంత్రి ఆర్కే రోజా ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కనిపించకుండా పోయారు. ఆమె ఎక్కువగా చెన్నైలోనో, లేక కుటుంబ సభ్యులతో కలసి విదేశాల్లోనూ పర్యటిస్తూ కాలం గడిపేవారు. పుణ్య క్షేత్రాలను దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. దాదాపు వంద రోజుల నుంచి ఆమె విజయవాడ వైపు కూడా రాలేదు. పార్టీ అధినేత జగన్ ను వచ్చి కలిసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో ఆర్కే రోజాపై అనేక రకమైన ప్రచారం జరిగింది. ఆమె తమిళనాడు రాజకీయాల్లోకి వెళుతున్నారని, హీరో విజయ్ పెడుతున్న పార్టీలో చేరి తమిళనాడు రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరిగింది. అందుకు తగిన విధంగానే ఆర్కే రోజా రాష్ట్ర రాజకీయాలకు దూరంగా ఉండటంతో నిజమేనని నమ్మిన వాళ్లుచాలా మంది ఉన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆర్కే రోజాకు మంచి ప్రయారిటీ ఇచ్చారు. మంత్రి పదవి ఇవ్వకముందు నామినేటెడ్ పదవి ఇచ్చారు. అదే సమయంలో మంత్రి వర్గ విస్తరణలో ఆమెకు చోటు కల్పించి చిత్తూరు జిల్లా నుంచి ప్రత్యేక ప్రాధాన్యత ఆర్కే రోజాకు ఉందని జగన్ పార్టీ నేతలకు చెప్పకనే చెప్పారు. చిత్తూరు జిల్లాలో చాలా మంది ఆర్కే రోజాకు వ్యతిరేకమయినా జగన్ వారెవ్వరినీ లెక్క చేయకుండా మంత్రిపదవి ఇవ్వడంతో ఆమె మరింత రెచ్చిపోయారు. తన సొంత నియోజకవర్గంలోని నగరిలోనూ వైసీపీ నేతలను దూరం చేసుకున్నారు చివరకు ఎన్నికల సమయంలో అనేక నియోజకవర్గాల్లో

వివరాలు 2లో..

## విజయవాడ వరదల వల్ల పాడైన వాహనాల యజమానులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్!

- దెబ్బతిన్న వాహనాలు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్, ప్లంబింగ్ పనులను ఉచితంగా చేయాలని నిర్ణయం
- ఖర్చు మరీ ఎక్కువైతే యజమానులు కొంత భరించేలా ప్రణాళిక
- ఒకటి రెండ్రోజుల్లోనే దీనిపై స్పష్టత
- అనంతరం కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేయనున్న ప్రభుత్వం



**పెన్ పవర్,విజయవాడ :** విజయవాడ వాసులకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పబోతోంది. వరదల్లో దెబ్బతిన్న, మునిగి పాడైన వాహనాల మరమ్మతులకు అయ్యే ఖర్చులో కొంత భరించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. పాడైన ఇంట్లోని ఉపకరణాల ఖర్చులోనూ కొంత భరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో వేలాదిమందికి లబ్ధి జరగనుంది. గత రాత్రి విజయవాడ కలెక్టరేట్‌లో చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు.

**వాహన కంపెనీలతో ప్రభుత్వం సంప్రదింపులు...**

వరదల కారణంగా బైక్‌లు, ఆటోలు, కార్లు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. వీటిలో కొన్నింటికి బీమా ఉండగా, బీమా లేని వాహనాలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. అసలు వరదలతో సర్వం కోల్పోయిన బాధితులకు ఇది అదనపు ఖర్చు కానుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే ముందుకొచ్చి మరమ్మతులు చేయించి ఇవ్వాలని నిర్ణయించింది. రిపేరుకు తక్కువ మొత్తం అయితే ప్రభుత్వమే భరించాలని, ఎక్కువ అయితే మాత్రం కొంత వాటి యజమానులు కూడా భరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మరమ్మతు పనుల కోసం

వివరాలు 2లో..

## చంద్రబాబును అరెస్ట్ చేసి నేటికి ఏడాది...

- ఆరోజు ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నారు: మంత్రి కొల్లు రవీంద్ర
- ప్రజల కన్నీళ్లు తుడిచేందుకు నేడు చంద్రబాబు కష్టపడుతున్నారన్న మంత్రి
- వైసీపీ చేసిన పనికి ఇప్పుడు విజయవాడ మునిగిపోయిందని ఆగ్రహం
- కేంద్రమంత్రులను పిలిపించుకొని వరద పరిస్థితులను వివరించారని వెల్లడి



**పెన్ పవర్,విజయవాడ :** వైసీపీ పాలనలో చంద్రబాబును అరెస్ట్ చేశారని ఆ రోజు ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నారని, ఈరోజు భారీ వరదల కారణంగా ప్రజలు కన్నీళ్లు పెట్టుకోకూడదని సీఎం నిత్యం కష్టపడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబును అరెస్ట్ చేసి నేటికి సరిగ్గా ఏడాది అవుతుందన్నారు. నాడు ప్రతిపక్ష హోదాలో, నేడు సీఎంగా ప్రజల కన్నీళ్లు తుడిచేందుకు చంద్రబాబు తాపత్రయపడుతున్నారన్నారు. బుడమేరు కట్ట మీద మట్టిని దోచుకెళ్లారని, వైసీపీ చేసిన పనికి ఇప్పుడు విజయవాడ మునిగిపోయిందని ఆరోపించారు. భారీ వరదల సమయంలో పడవలు తీసుకువచ్చి ప్రకాశం బ్యారేజీని దెబ్బతీసే ప్రయత్నం చేశారన్నారు. తొమ్మిది రోజులుగా

మిగతా 2లో

## క్లౌడ్ బరస్ట్ వల్ల విపరీతమైన వర్షాలు



**న్యూఢిల్లీ, పెన్ పవర్ సెప్టెంబర్ 9:** ఈ స్థాయిలో వానలు కురుస్తున్నాయి. ఇలాంటి దుస్థితి నేను ఎప్పుడూ చూడ లేదు.. గుజరాత్ రాష్ట్రాన్ని చాలా ఏళ్లుగా పరిపాలించా. ఎన్నో ప్రకృతి విపత్తులను చవి చూశా. కానీ ఇప్పుడు కురుస్తున్న వర్షం, పోటెత్తుతున్న వరద ఎప్పుడో చూడలేదు. గుజరాత్ మాత్రమే కాదు, దేశం మొత్తం జల ప్రళయం కనిపిస్తోందని" స్వయంగా నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల వర్షాలకు తెలుగు రాష్ట్రాల్లోని విజయవాడ, ఖమ్మం, వరంగల్ ప్రాంతాలు నీట మునిగాయి. గంటల వ్యవధిలోనే30+ సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షం వల్ల వరద తాకిడి పెరిగిపోవడంతో జాతీయ రహదారులు కొట్టుకుపోయాయి. వంతెనలు నామ రూపాలు లేకుండా పోయాయి. పంట పొలాలు ఇసుక మేటలు వేసాయి. గ్రామాలకు గ్రామాలు బయటి ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ఇప్పటికీ చాలా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదు. గత ఏడాది క్లౌడ్ బరస్ట్ వల్ల విపరీతమైన వర్షాలు కురిసాయి. కొన్ని ప్రాంతాలలో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురవలేదు.ఈసారి ఎల్ నినో ప్రభావం పూర్తిగా లేదు. అయితే గతానికంటే భిన్నంగా అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి.. అయితే ఈ వర్షాలు అన్నిచోట్ల పడితే పెద్దగా సమస్య ఉండేది

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# మళ్లీ మొదటికొచ్చిన మణిపూర్

కుకీ, మెయితీ తెగల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలు కాస్తా గతేడాది ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌ను ఏ విధంగా రణరంగంగా మార్చాయో అందరికీ తెలిసిందే. వందల మంది ప్రాణాలు కోల్పోగా.. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఎన్నో దారుణ ఘటనలు చోటు చేసుకున్నాయి. అయితే గత కొంత కాలంగా మణిపూర్‌లో డ్రోన్ దాడులు సంచలనం సృష్టించగా.. తాజాగా జరిగిన ఓ ఘటన మళ్లీ హింసాత్మక ఘటనలకు ఆజ్యం పోశాయి. తాజాగా జిరిబం జిల్లాలో శనివారం ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న కాల్పుల్లో మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. గత వారం రోజులుగా మణిపూర్‌లో హింస చెలరేగుతుండటం మరోసారి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.జిరిబం జిల్లాకు సమీపంలో ఉన్న ఓ ఇంట్లో చొరబడిన మిలిటెంట్లు.. గాఢనిద్రలో ఉన్న ఓ వ్యక్తిని కాల్చి చంపేశారు. అనంతరం విషయం తెలుసుకుని పోలీసులు రంగంలోకి దిగారు. దీంతో ఇరు వర్గాల మధ్య భీకర కాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో ముగ్గురు మిలిటెంట్లతో పాటు ఓ సాధారణ పౌరుడు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు.. చురాచాంద్‌పూర్‌లో మిలిటెంట్లకు చెందిన 3 బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. ఇక ఇటీవల బిష్ణుపూర్ జిల్లాలో రాకెట్ దాడులను చురాచాంద్‌పూర్ నుంచే చేపట్టినట్లు తెలుస్తోంది.కొత్త తరహా దాడులతో రెచ్చిపోతున్నారు కుకీ తీవ్రవాదులు . డ్రోన్లు , రాకెట్ దాడులతో రాజధాని ఇంఫాల్ లోని ప్రముఖ నాయకుల ఇళ్లను వాళ్లు టార్గెట్ చేయడం తీవ్ర కలకలం రేపింది. వెంటనే అప్రమత్తమైన సైన్యం యాంటీ డ్రోన్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసింది. కేంద్రం మణిపూర్‌లో తాజా పరిస్థితిపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి నివేదికలు తెప్పించుకుంటోంది. డ్రోన్లు , రాకెట్‌లను వాళ్లు ప్రయోగించడం తీవ్ర కలకలం రేపుతోంది. కుకీ, మెయితీ తెగల మధ్య చోటు చేసుకున్న ఘర్షణల కారణంగా మణిపూర్‌లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. డ్రోన్ దాడులకు కుకీ తీవ్రవాదులే కారణమని మెయితీ వర్గం ఆరోపిస్తోంది. సరిగ్గా పదహారు నెలల క్రితం మణిపూర్ మంటల్లో రగిలిపోయింది. గతేడాది మే 3న చెలరేగిన అల్లర్లు దాదాపు సంవత్సరం పాటు తీవ్రమైన ఆందోళనకు కారణమయ్యాయి. కొన్ని రోజులు ఈ పరిస్థితులు కాస్త సద్దుమణిగాయని అనుకుంటున్న తరుణంలో.. మణిపూర్ అంతర్యుద్ధం కాస్తా యుద్ధంగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో మాదిరి డ్రోన్లతో రాకెట్ దాడులకు తెగబడుతున్నారు మిలిటెంట్లు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాకు సమీపంలోని రెండు ప్రదేశాల్లో జనావాసాలపై బాంబులు వేయడానికి ఉగ్రవాదులు డ్రోన్‌లను ఉపయోగించారు. ఈ పరిస్థితుల్లో ఆ ప్రాంతంలో రాత్రుళ్లు అందరూ లైట్లు ఆఫ్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం మణిపూర్‌లోని బిష్ణుపూర్, ఇంఫాల్ తూర్పు జిల్లాల శివార్లలోని నివాసితులు డ్రోన్‌ల దాడులకు భయపడుతూ బతుకుతున్నారు. సెప్టెంబర్ 6న బిష్ణుపూర్ జిల్లాలో మిలిటెంటు లాంగ్ రేంజ్ రాకెట్‌లను మోహరించారు. మణిపూర్ మొదటి ముఖ్యమంత్రి మైరెంబమ్ కోయిరెంగ్ నివాసంపై రాకెట్ దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో ఒక సీనియర్ సిటిజన్ ప్రాణాలు కోల్పోగా.. బిష్ణుపూర్ జిల్లా మొయిరాంగ్ ఖోయిరు లైకైలో ఆరుగురు పౌరులు గాయపడ్డారు.కొండ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించేందుకు పోలీసు బృందాలు, అదనపు భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. ముల్సాంగ్ గ్రామంలో రెండు బంకర్‌లు, చురచంద్‌పూర్‌లోని లైకా ముల్సౌ గ్రామంలో ఒక బంకర్‌ను భద్రతా బలగాలు ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. అక్కడ ఎస్పీతో సహా బిష్ణుపూర్ జిల్లా పోలీసు బృందాలు అనుమానిత కుకీ మిలిటెంట్లు కాల్పులు జరిపిన ప్రాంతానికి చేరుకున్నాయి. అయితే, పోలీసు బృందం గట్టిగా ప్రతిఘటించి దాడిని తిప్పికొట్టినట్లు అధికారులు చెబుతున్నారు. డ్రోన్లతో జరిగే దాడులను అడ్డుకోడానికి భారత వైమానిక పెట్రోలింగ్‌కి చెందిన మిలటరీ హెలికాప్టర్‌ను మోహరించారు. శాంతిభద్రతలను పరిశీలించేందుకు ఉన్నత స్థాయి భద్రతా సమావేశాలు నిర్వహిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్న అధికారులు, ఎలాంటి ఆకస్మిక పరిస్థితులు తలెత్తినా స్పందించేందుకు అవసరమైన ప్రత్యేక బలగాలను సిద్ధం చేస్తున్నారు.మణిపూర్‌లో భారీ మిలిటెంట్ సమూహాల కదలికలపై నిఘా ఉంచడానికి భద్రతా బలగాలు హై అలర్ట్‌ను ప్రకటించాయి. బిష్ణుపూర్ జిల్లాలో, ఆకాశంలోకి లైటింగ్ రౌండ్లు కాల్పులు జరుపుతున్నారు. యుద్ధాన్ని తలపించే ఈ పరిస్థితికి ప్రజలు భయాందోళనలకు గురౌతున్నారు. ఈ గందరగోళం మధ్య భద్రతా బలగాలు కాల్పులు జరిపారా లేదంటే మిలిటెంట్లు కాల్పులు జరుపుతున్నారో తెలియక ప్రజలంతా బిక్కు బిక్కుమంటున్నారు. మరోవైపు, భద్రతా బలగాలు మిలిటెంట్ల బంకర్లను ధ్వంసం చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే, మణిపూర్‌లో డ్రోన్ ఆయుధాన్ని ఉపయోగించిన మొదటి సంఘటన సెప్టెంబర్ 1న ఇంఫాల్ పశ్చిమ జిల్లా కౌత్రుక్ గ్రామంలో జరిగింది. ఈ దాడిలో మిలిటెంట్లు తుపాకులు కూడా ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. ఆ తర్వాత రోజు, దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సెంజామ్ చిరాంగ్‌లో మరో డ్రోన్ దాడి జరగ్గా ఇందులో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఇలా వరుస దాడులతో మణిపూర్ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.అయితే, మణిపూర్‌లో డ్రోన్లు ఎగరడం ఇటీవల కాలం షరామామూలు అయ్యింది. కుకీ-జో తెగలు, మెజారిటీ మైతేయీల మధ్య గతేడాది వివాదం మొదలైనప్పటి నుండీ కెమేరా డ్రోన్లు ఎగురుతుండటం కనిపిస్తూనే ఉంది. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించడానికి అధికారులతో పాటు.. యూట్యూబర్లు కూడా డ్రోన్ కెమేరాలను వినియోగిస్తున్నారు. భద్రతా దళాల నిఘా డ్రోన్లు కూడా తిరుగుతూనే ఉన్నాయి. అయితే, ఇప్పుడు డ్రోన్లతో లాంగ్ రేంజ్ రాకెట్లతో గ్రెనేడ్లను వదలడం ఆందోళన కలిగిస్తోంది. కుకీ చొరబాటుదార్లు వీటిని ప్రయోగిస్తున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. కుకీ తెగలు నివాసముండే ప్రాంతాల నుండి ఈ డ్రోన్లు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, ఇవి నిజంగానే కుకీ మిలిటెంట్లు పంపిస్తున్నరా లేదంటే దీని వెనుక బయటి శక్తులు కుట్ర దాగుందా అనేది అర్థం కావట్లేదు.మైతేయి తెగకు రిజర్వేషన్లు కల్పిస్తూ మణిపూర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో ఏడాది క్రితం మణిపూర్‌లో హింస రాజుకుంది. అనాలోచితంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తోడు.. చారిత్రిక శత్రుత్వం తోడయ్యి.. వందల మంది ప్రాణాలను బలిగొన్న ఈ హింస 2023 మే 3న మొదలైయ్యింది. స్విట్జర్లాండ్ ఆఫ్ ఇండియాగా పేరుపొందిన మణిపూర్ సెగలు యావత్ దేశాన్ని కలవరానికి గురిచేశాయి. అలాంటి ఆందోళనల మధ్య ఇప్పుడు డ్రోన్ల దాడులు మణిపూర్‌లో మరింత హింసకు దారితీస్తాయనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. అందులోనూ, డ్రోన్ల ద్వారా బాంబులు వేయడాన్ని దాటేసి.. డ్రోన్లతో రాకెట్‌లను ప్రయోగించడమంటే.. అది ఆధునిక మిలటరీ పరికరాలు, సాయం లేనిదే సాధ్యం కాదంటున్నారు భద్రతాదళాలు. నిజానికి, ఈ డ్రోన్ల దాడుల గురించి కొన్ని రోజులుగా అనుమానాలు వ్యక్తమవుతూనే ఉననాయి. గత నవంబర్‌లో ఇంఫాల్ విమానాశ్రయం వద్ద భారీ డ్రోన్ ఒకటి ఎగురుతున్నట్లు గుర్తించారు. దీని కోసం ఏకంగా రాఫెల్ యుద్ధ విమానాన్ని కూడా రంగంలోకి దించారు.అయితే, ఇంత ఆధునిక డ్రోన్లను స్థానికంగా తయారుచేస్తున్నట్లు కూడా అనుమానాలు లేకపోలేదు. ఇటీవల డ్రోన్ల తయారీకి అవసరమైన పరికరాలతో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తిని అసోం స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మణిపూర్‌లో తీవ్రవాద బృందాలకు చేరవేయడానికే వాటిని ఆ వ్యక్తి కొనుగోలు చేసాడని పోలీసులు అనుమానించారు. అది జరిగిన కొన్ని రోజులకే? అత్యాధునిక టెక్నాలజీ డ్రోన్‌లకు వాడే బ్యాటరీలతో మణిపూర్‌లోకి ఎంటర్ అయిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ బ్యాటరీలను సినిమా నిర్మాణంలో వినియోగించడానికి తీసుకొస్తున్నట్లు సినీ నిర్మాతల సంఘం వెల్లడించింది. అతని అరెస్ట్‌ను ఖండించింది. అయితే, ఇలాంటి డ్రోన్ టెక్నాలజీ మణిపూర్‌లోకి రావడం అల్లర్లలో ఉగ్రవాద శక్తుల ప్రాభల్యాన్ని పెంచుతుందనడానికి సూచనగా పోలీసులు పరిగణిస్తున్నారు. దీని వెనుక బయటి శక్తుల హస్తం కూడా ఉందనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

# వర్షాలపై మొబైళ్లకు అలెర్ట్ సందేశాలు పంపండి..

హోం మంత్రి అనిత అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్రను వానలు ముంచెత్తుతుండడంతో విజయవాడ నుంచి హోంమంత్రి అనిత బయలుదేరి వెళ్లారు. కోస్తాంధ్రలోను అతి భారీ వర్షాలున్నాయన్న వాతావరణ శాఖ సమాచరం నేపథ్యంలో రాబోయే 72 గంటలు జాగ్రత్తగా ఉండాలని హోం మంత్రి సూచించారు. వంశధార, నాగావళి, బహుదా పరివాహక ప్రాంతాల ప్రజల మొబైళ్లకు ఎప్పటికప్పుడు అలెర్ట్ సందేశాలు పంపి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. %గోపాలపట్నం, కంచరపాలెం, అరకులోయ పరిసర ప్రాంతాలలో కొండ చరియలు విరిగిపడిన ఘటనలపై హోంమంత్రి విచారం వ్యక్తం చేశారు. జ్ఞానాపురం ఎర్రిగెడ్డ, అల్లూరి జిల్లా మత్స్యగెడ్డల ఉగ్రరూపంపై ఎప్పటికప్పుడు వివరాలందించాలని ఆదేశించారు.

ముంపు బారిన పడే అవకాశమున్న ప్రాంతాలలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు.కాగా.. ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ తీరం దాటనుండడంతో ఆ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాల్లో వరదలు ఉప్పొంగుతున్నాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అల్లూరి జిల్లా చింతపల్లి- నర్సీపట్నం ప్రధాన రహదారిలో రాకపోకలు బంద్ అయ్యాయి. రెండు రోజుల వర్షానికి పలుచోట్ల కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. మడిగుంట, రాజుపాకలు గ్రామాల వద్ద వరద ఉధృతికి కాజ్ వేలు కొట్టుకుపోయాయి.

గిరిజన ప్రాంతంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

దీంతో తెల్లవారుజాము నుంచి చింతపల్లి- నర్సీపట్నం మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. రింతాడ గ్రామం వద్ద మరో కాజ్‌వే కూడా కొట్టుకొని పోవడంతో సీలేరు -చింతపల్లి మార్గంలో కూడా రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్ వేలు పునరుద్ధరణ చర్యలను జాతీయ రహదారి అధికారులు మొదలుపెట్టారు.

# పూరి తీరాన్ని తాకిన తుపాన్

మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురియవచ్చని తెల్పింది. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మరోవైపు ఏపీలో నేడు, మంగళవారాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణశాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో అధికంగా ఉంటుందని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.ఇక ఏలూరు, అల్లూరి, ఉభయ గోదావరి, ఎన్టీఆర్ శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి.. ముఖ్యంగా అల్లూ రి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం సోమవారం మధ్యాహ్నానికి తీవ్ర వాయుగుండంగా మారిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో పెనుగాలులు వీస్తున్నాయని చెప్పారు. ఒడిశాలోని పూరి తీరానికి 50 కి.మీ. దూరంలో గంటకు 10 కి.మీ. వేగంతో వాయుగుండం నెమ్మదిగా కదులుతోందని వివరించారు. దీని ప్రభావంతో తీరం వెంబడి పెనుగాలులు వీస్తాయని వివరించారు. సోమవారం సాయంత్రానికి పూరి వద్ద వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేశారు.ఈ వాయుగుండం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి, గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఉత్తరాంధ్ర, అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. గంగవరం, కళింగపట్నం, భీమునిపట్నం, కాకినాడ పోర్టులలో మూడో నెంబర్ ప్రమాద సూచికను జారీ చేశారు.

భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయని, వాయుగుండం ప్రభావంతో వరదలు ముంచెత్తే ప్రమాదం ఉందని అధికారులు ప్రజలను హెచ్చరించారు. వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని, లోతట్టు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ఘాట్ రోడ్ లలో ప్రయాణించవద్దని వాహనదారులను హెచ్చరించారు. పలు ఘాట్ రోడ్ లలో వాహనాల రాకపోకలను అధికారులు నిషేధించారు.

వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు వెల్లడించారు. కుమ్రంభీం, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఖమ్మం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం అది పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కళింగపట్నానికి 240 కిలోమీటర్లు, ఒడిశాకు 180 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. సోమవారం ఉదయం నాటికి ఒడిశా, పశ్చిమబంగ తీరాల్లో తీవ్ర వాయుగుండంగా బలపడింది. అనంతరం పశ్చిమ, వాయువ్య దిశగా ప్రయాణిస్తూ సోమవారం మధ్యాహ్నానికి ఒడిశాలోని పూరీ సమీపంలో తీరం దాటే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది.రెండు రోజుల్లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వైపు ప్రయాణించనుంది. వాయుగుండం ప్రభావంతో రాగల 48 గంటల్లో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది.

తెలంగాణలో నేటి నుంచి వరుసగా మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ స్పష్టం చేసింది. హైదరాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురియవచ్చని తెల్పింది. దీంతో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.మరోవైపు ఏపీలో సోమ, మంగళవారాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణశాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో అధికంగా ఉంటుందని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

# ప్రకాశం బ్యారేజ్‌కి బోట్లు ఢీ -ఇద్దరు అరెస్ట్..

నివేదిక చేరింది.. బ్యారేజీకి బోట్లు ఢీకొన్న సంఘటనలో కుట్ర కోణం ఉందని నివేదికలో వెల్లడించారు అధికారులు.. ఇప్పటి వరకు ఈ బోట్లు తమవేనని ఎవ్వరూ రాకపోవడమే కుట్ర కోణం ఉందనడానికి నిదర్శనమన్న నివేదికలో పేర్కొన్నారు అధికారులు.. బ్యారేజీని ఢీకొన్న బోట్లు వైసీపీ నేతలు. కార్యకర్తలవని నివేదికలో నిర్ధారించారు. వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరుల బోట్లుగా గుర్తించినట్టు నివేదికలో వెల్లడించారు. ఇసుక అక్రమ తవ్వకాలకు నందిగం సురేష్ ఉషాద్రికి చెందిన బోట్లనే వినియోగించుకునేవారని నివేదికలో పేర్కొన్నారు.. బోట్ల రిజిస్ట్రేషన్ల నెంబర్ల ద్వారా యజమానులను గుర్తించినట్టు తెలిపారు.. AP-IV-M-SB-0022, AP-IV-M-SB-0023, AP-IV-M-SB-0017 నెంబర్లున్న బోట్లతో పాటు.. ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టాయి మరో రెండు బోట్లు. ఉషాద్రి, కర్రి నరసింహా స్వామి, గూడూరు నాగమల్లేశ్వరీల బోట్లుగా గుర్తించారు. ఉషాద్రికి చెందిన మూడు బోట్లను కలిపి కట్టడం వెనుక కుట్ర కోణం ఉందన్న నివేదికలో వెల్లడించారు. ఇక, సహజంగా మూడు బోట్లను కలిపి కట్టరని నివేదికలో స్పష్టం చేశారు అధికారులు.. ఇనుప చైన్లతో కాకుండా.. ప్లాస్టిక్ రోప్స్‌తో బోట్లను కట్టేసినట్టు గుర్తించారు.. తాము హెచ్చరిస్తున్నా ఇనుప చైన్లతో బోట్లను కట్టలేదని స్థానికులు చెప్పారని నివేదికలో వెల్లడించారు.. తమ బోట్లతో పాటు.. సమీపంలోన మరో రెండు బోట్లు కూడా కొట్టుకెళ్లేలా ప్లాన్ చేశారని నివేదికలో చెప్పుకొచ్చారు అధికారులు. దీనిపై మరింత లోతుగా విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు పోలీస్ అధికారులు

# చంద్రబాబును అరెస్ట్ చేసి నేటికి ఏడాది...

చంద్రబాబు కలెక్టరేట్‌లోనే ఉండి కేంద్రమంత్రులను పిలిపించుకొని వరద పరిస్థితులను వారికి వివరించినట్లు చెప్పారు. ఆ రోజు చంద్రబాబును అరెస్ట్ చేయడం హెడ్ లైన్ అయిందేమో... కానీ ప్రజలు మాత్రం వైసీపీకి అధికారం లేకుండా చేశారని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. నాడు చంద్రబాబును తప్పుడు కేసులో అరెస్ట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ కేవలం అమరావతి మీదే కాదు... విజయవాడ మీద కూడా పగబట్టారన్నారు.

రుషికొండపై సమీక్ష చేసిన జగన్ బుడమేరుపై కూడా సమీక్ష చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. చంద్రబాబును చూసి జగన్ నేర్చుకోవాలని హితవు పలికారు

# క్లౌడ్ బరస్ట్ వల్ల విపరీతమైన వర్షాలు

కాదు. అయితే వర్షం ఒక్క చోట మాత్రమే కుండ పోతగా కురవడం వల్ల ఇబ్బంది ఎదురవుతోంది. దీనిని వాతావరణ నిపుణులు క్లౌడ్ బరస్ట్ అని పిలుస్తున్నారు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మేడారం ప్రాంతంలో క్లౌడ్ బరస్ట్ అవ్వడం వల్ల కొన్ని వేల ఎకరాల్లో అడవి నాశనమైంది. చెట్లు మొత్తం విరిగిపోయాయి.. కృష్ణాజిల్లాలో విజయవాడ నగరం మొత్తం నీట మునిగిపోయింది.. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే ఖమ్మం, విజయవాడ, వరంగల్ మాత్రమే కాదు.. దేవభూమి ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్ వంటి రాష్ట్రాలలో క్లౌడ్ బరస్ట్ లు చోటు చేసుకుంటున్నాయి.. కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రాంతంలో జలవిలయం చోటు చేసుకోవడానికి కూడా క్లౌడ్ బరస్ట్ కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.మనదేశంలోనే కాదు చైనాలోనూ క్లౌడ్ బరస్ట్ లు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ యాగి తుఫాను పెను విధ్వంసం సృష్టిస్తోంది. వరదలు చుట్టుముట్టడంతో చైనా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అక్కడిదాకా ఎందుకు పూర్తి ఎడారి ప్రాంతమైన దుబాయ్ లోనూ విపరీతమైన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతాన్ని వరదలు వణికిస్తున్నాయి.. ఇక బంగ్లాదేశ్ లోనూ తుఫాన్ అల్లకల్లోలం సృష్టిస్తోంది. ఇలా ప్రపంచం నలుమూలల ఏదో ఒకచోట ప్రకృతి విపత్తు చోటు చేసుకుంటూనే ఉంది. అంటే అమెరికా నుంచి మొదలు పెడితే ఆఫ్ఘనిస్తాన్ వరకు క్లౌడ్ బరస్ట్ విపత్తు అనేది ఉంది..

ప్రకృతిపై మనిషి చేస్తున్న పెత్తనం వల్ల ఇలాంటి ఇలాంటి విపత్తులు చోటుచేసుకుంటున్నాయి. వాతావరణ మార్పుల వల్ల మేఘాలు ఏర్పడటం.. అవి బద్దలైపోయి విస్తారంగా వర్షం కురవడం వంటి పరిణామాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు మేఘాలు అంతటా విస్తరించి వర్షాలు కురిసేవి. కానీ ఇప్పుడు మేఘాల గమనంలో కూడా మార్పు వస్తోంది. ఒకే చోట కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి.

భూ ఉపరితలం వేడెక్కడం.. సముద్ర ఉపరితల వేడెక్కడం.. మేఘాలు భారీగా సముద్రపు నీటిని తీసుకొని అంతే స్థాయిలో ఒకే చోట వర్షాలు కురిపించడం వంటి పరిణామాల వల్ల ఇంతటి విపత్తులు చోటు చేసుకుంటున్నాయని వాతావరణ నిపుణులు అంటున్నారు. గత ఏడాది జూలై నెలలో క్లౌడ్ బరస్ట్ అయింది.

ఆ సమయంలో దానిని విదేశీ కుట్ర అని నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోపించారు.. అందులో ఎంతవరకు నిజం ఉందో తెలియదు గాని.. ప్రస్తుతం మనిషి చేస్తున్న పనుల వల్ల ప్రకృతి ఆగ్రహిస్తోందనేది మాత్రం నూటికి నూరుపాళ్ళు కఠిన వాస్తవం.

# రాజమండ్రిలో చిరుత సంచారం

**క్రైమ్ బ్యూరో పెన్ పవర్ రాజమండ్రి, సెప్టెంబర్ 9:** రాజమండ్రి దివాన్‌చెరువు సమీపంలో చిరుతపులి పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు లాలాచెరువు, దివాన్‌చెరువు సమీప ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. తూర్పుగోదావరి జిల్లా ఇంఛార్జి డీఎఫ్‌వో ఎస్.భరణి మీడియా సమావేశం నిర్వహించి దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో లభ్యమైన పాదముద్రలను బట్టి ఇక్కడ సంచరించింది చిరుతపులిగా నిర్ధారణచేసినట్లు డీఎఫ్‌వో భరని ధృవీకరించారు. రాజమండ్రి దివాన్‌చెరువు, లాలాచెరువు సమీపప్రాంతాల్లోని ముఖ్యంగా స్వరూప్ నగర్, పద్మావతి నగర్, రూప నగర్, శ్రీరామ్‌నగర్, తారకరామానగర్, ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈప్రదేశాల్లో చిరుత తప్పకుండా సంచరిస్తుందన్నారు.

ఎవ్వరూ ఆరు బయట కూర్చొవద్దని, బయటకు రావాల్సి వస్తే వెంట టార్చ్‌లైట్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలన్నారు. ముఖ్యంగా ఆరుబయట ఉండే బాత్‌రూమ్ తలుపులుకు గడియ పెట్టుకోవాలని, చిన్నపిల్లల్ని ట్యూషన్లుకు చీకటి పడిన తరువాత పంపవద్దని, పిల్లలు బయట ఆడుకోనివ్వ వద్దని హెచ్చరించారు ఇప్పటివరకు మనుషులపై ఎటువంటి దాడి జరగలేదని, త్వరలోనే చిరుతను పట్టుకుంటామన్నారు. అందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. అయితే చిరుత బిహేవియర్‌ను బట్టి ఎన్ని రోజుల్లో పట్టుకోగలము అనేది ఆధారపడి ఉంటుందని, అనుమానం ఉన్నచోట్ల ట్రాప్‌కెమెరాలను, బోన్లు ఏర్పాటు చేస్తున్నామని డీఎఫ్‌వో తెలిపారు.

చిరుతకు సంబందించిన సమాచారం ఏమున్నా వెంటనే తెలపాలని సూచించారు. రాత్రి అయితే చాలు రాజమండ్రి శివారు ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో చిరుతపులి సంచారంతో భయం భయంగా గడుపుతున్నారు. పులి సంచారం చేస్తున్న ప్రాంతాలుగా భావిస్తున్న చోట దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. పలు చోట్ల ఫెక్సీ బ్యానర్లను ఏర్పాటు చేశారు. రాజమండ్రి శివారు ప్రాంతాలకు ముఖ్యంగా చిరుత పులులు దారితప్పి వచ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి.. రాజమండ్రి శివారు ప్రాంతంలోని దివాన్‌చెరువు ను ఆనుకుని దూరంలో అడ్డతీగల రిజర్వుఫారెస్ట్ ఉండగా అక్కడి నుంచే తరచూ చిరుత పులులు దారితప్పి ఇటువైపుగా వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఏదైనా జంతువును వేటాడే క్రమంలో దారితప్పి ఇలా జనావాసాల్లోకి చొరబడతాయని అటవీశాఖ అధికారులు తెలిపారు.



రాజమండ్రి దివాన్‌చెరువు సమీపంలో చిరుతపులి పాదముద్రలు గుర్తించిన అటవీ శాఖ అధికారులు లాలాచెరువు, దివాన్‌చెరువు సమీప ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో లభ్యమైన పాద ముద్రలను బట్టి చిరుతపులిగా నిర్ధారించినట్లు డీఎఫ్‌వో ధృవీకరించారు. ముఖ్యంగా స్వరూప్‌నగర్, పద్మావతినగర్, రూప్‌నగర్, శ్రీరామ్‌నగర్, తారకరామానగర్, ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రిపూట ఎవ్వరూ ఆరుబయట కూర్చొవద్దని, బయటకు రావాల్సి వస్తే వెంట టార్చ్‌లైట్ తప్పనిసరిగా తీసుకువెళ్లాలన్నారు. చిన్న పిల్లల్ని ట్యూషన్లుకు చీకటి పడిన తరువాత పంపవద్దని, పిల్లల్ని బయట ఆడుకోనివ్వద్దని హెచ్చరించారు.

**'ఈ నెంబరుకు కాల్ చేయండి'**

ఇప్పటివరకు మనుషులపై ఎటువంటి దాడి జరగలేదని, త్వరలోనే చిరుతను పట్టుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నట్లు డీఎఫ్‌వో వెల్లడించారు. అనుమానం ఉన్నచోట్ల ట్రాప్ కెమెరాలు, బోన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిరుతకు సంబందించిన సమాచారం ఏమన్నా తెలిస్తే 18004255909 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మరోవైపు, చిరుత సంచారంతో రాజమండ్రి శివారు ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దివాన్‌చెరువు సమీప ప్రాంతంలో భయం భయంగా గడుపుతున్నారు. పులి సంచారం చేస్తున్న ప్రాంతాలుగా భావిస్తున్న చోట దండోరా వేయించి ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పలు చోట్ల ఫెక్సీ బ్యానర్లను ఏర్పాటు చేశారు.

## బోట్లకు లంగరు వేయకుండా కేవలం ప్లాస్టిక్ తాడుతో కట్టారు: నిమ్మల రామానాయుడు

కేవలం ప్లాస్టిక్ తాడుతో కట్టారని అన్నారు. ఈ బోట్ల యజమాని వైసీపీ నేత అని చెప్పారు. ఒక్కో బోటు 45 నుంచి 50 టన్నుల బరువు ఉందని... ఈ బోట్లు 67, 69, 70 గేట్లను దాటి కౌంటర్ వెయిట్లను బలంగా ఢీకొన్నాయని నిమ్మల తెలిపారు. అయితే అదృష్టవశాత్తు బ్యారేజీకి సంబంధించిన ప్రధాన కట్టడం, గేట్లకు ఎలాంటి ప్రమాదం జరగలేదని చెప్పారు. వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ తలశిల రఘురాంలకు బోట్ల యజమాని ఉషాద్రి రామ్మోహన్ దగ్గరి మనిషని అన్నారు. బోట్లకు వైసీపీ రంగులు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందని చెప్పారు. దాదాపు రూ. కోటిన్నర విలువ చేసే బోట్ల పట్ల ఇంత నిర్లక్ష్యంగా ఉంటారా? అని ప్రశ్నించారు.

## మళ్లీ గవర్నమెంట్ వర్సెస్ గవర్నర్

పుస్తకాలను చదవలేకపోతున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్ని చక్కదిద్దాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదని గవర్నర్ వ్యాఖ్యానించారు. గవర్నర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి.అయితే తమిళనాడులో విద్యావిధానం చాలా గొప్పగా ఉందని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. మంచి సిలబస్.. స్వతంత్ర, విశాలమైన ఆలోచనల్ని ప్రోత్సహిస్తుందని ఇలాంటి వాటిని బేరీజు వేసుకుంటే దేశంలోనే తమిళనాడు సిలబస్ అత్యంత విజయవంతమైనదన్నారు. దేశవ్యాప్తంగా తమిళనాడు విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని గుర్తు చేశారు. ఐటీ ఇండస్ట్రీలో తమిళ యూత్ తమదైన ప్రతిభ చూపుతున్నారని సిలబస్ బాగోలేకపోతే వీరంతా ఎలా ఎదుగుతారని ఉదయనిధి ప్రశ్న. గవర్నర్ వ్యాఖ్యలు తమ విద్యార్థులు, టీచర్లను అవమానించేలా ఉన్నాయన్నారు. ఇలాంటి వ్యాఖ్యలను సహించే ప్రశ్నే లేదన్నారు. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గవర్నర్ వచ్చిన సీటీ రవి అనేక సమస్యలు సృష్టిస్తూనే ఉన్నారు. బిల్లులు ఆమోదించకపోవడం.. వంటివి చేశారు. గవర్నర్ పై స్టాలిన్ సుప్రీంకోర్టులో పిటిషన్లు కూడా వేసింది. ఇటీవల కొంత కాలంగా సైలెంట్ గా ఉన్నట్లుగా ఉన్న ఆయన తాజాగా విమర్శలు ప్రారంభించడంతో డీఎంకే కూడా ఎదురుదాడి ప్రారంభించింది. ఈ వ్యవహారం ఎక్కడి వరకూ వెళ్తుందో చూడాల్సి ఉంది.

## అబుదాబి యువరాజుతో మోదీ భేటీ

మంచి సహకారం ఉందని పేర్కొంది. ఇరు దేశాలు చారిత్రాత్మక సన్నిహిత సంబంధాలను కొనసాగించడం జరుగుతుంది” అని తెలిపింది. ఇక మోదీతో క్రౌన్ ప్రిన్స్ సమావేశంలో కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పూరి, పీయూష్ గోయెల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా యువరాజు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కూడా భేటీ అవుతారు. అలాగే దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మంగళవారం జరిగే బిజినెస్ ఫోరం సదస్సులో కూడా ఆయన పాల్గొననున్నారు.

## రోజా రీ ఎంట్రీ...

అభ్యర్థులను జగన్ మార్చారు. ఐ ప్యాక్ టీం ఇచ్చిన నివేదికలను అనుసరించి అభ్యర్థులను మార్చారు. కొందరిని మరొక నియోజకవర్గాలకు పంపించి వేశారు. రోజాను కూడా నగరి నుంచి మారుస్తారన్న ప్రచారం జరిగింది. అయితే జగన్ మాత్రం చివరకు ఆర్కే రోజాకు నగరి టిక్కెట్ ను ఖరారు చేశారు. దీంతో ఆమె ఖుషీ అయ్యారు. ఆఖరుకు రోజా కు వ్యతిరేకంగా ఉన్న పార్టీ నేతలతో జగన్ స్వయంగా మాట్లాడి రోజా గెలుపునకు సహకరించాలని కోరారు. కానీ రాష్ట్రంలో కూటమి గాలి బలమైన గాలులు వీయడంతో ఆర్కే రోజా కూడా దారుణంగా గాలి భానుప్రకాష్ చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే ఆర్కే రోజా ఇప్పటి వరకూ జరిగిన ప్రచారానికి తెర దింపారు. తిరిగి రాష్ట్ర రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేస్తున్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం లేదని నిలదీశారు. ఇక విజయవాడ వరదల్లో ప్రభుత్వం అట్టర్ ఫెయిల్యూర్ అంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కూడా షో చేయడం తప్ప బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నం చేయడం లేదని అన్నారు. ముందుగా ప్రజలను అప్రమత్తం చేయడంలో విఫలమయ్యారని తెలిపారు. మొత్తం మీద ఆర్కే రోజా రాజకీయంగా యాక్టివ్ కావడం పట్ల క్యాడర్‌లో సంతోషం కనపడుతుంది.

## విజయవాడ వరదల వల్ల పాడైన వాహనాల యజమానులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్!

ఆయా వాహన తయారీదారులతో సంప్రదింపులు జరుపుతోంది. అలాగే, వారి వద్ద సీఎస్ఆర్ నిధులు ఉంటాయి కాబట్టి వాటితో ఉచితంగా మరమ్మతులు చేసి ఇవ్వాలని కోరుతోంది.

**అర్బన్ కంపెనీకి పనులు**

వరదల కారణంగా దెబ్బతిన్న ఇంట్లోని ఎలక్ట్రిక్, ప్లంబింగ్, కార్పెంటరీ, పెయింటింగ్‌కు సంబంధించిన మరమ్మతు పనులను ‘అర్బన్ కంపెనీ’కి అప్పగిస్తున్నట్టు చంద్రబాబు తెలిపారు. ఒకట్రెండు రోజుల్లోనే దీనిపై స్పష్టత వస్తుందని, అనంతరం కరపత్రాలు ముద్రించి ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే, నష్టపోయిన వ్యాపారుల విషయంలోనూ బ్యాంకర్లతో చర్చలు జరుపుతున్నట్టు చెప్పారు.

# తెలంగాణ వీర వనిత మన చాకలి ఐలమ్మ

## - నేడు ఆమె వర్ధంతి




**న్యూస్ డెస్క్ పెన్‌పవర్ :** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ. నిజాం నవాబుకూ, ఆయన తొత్తులైన భూస్వాములకూ వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో తన ఇల్లునే కార్యాలయంగా మార్చిందామె. చిట్యాల ఐలమ్మ చాకలి ఐలమ్మ గా గుర్తింపు పొందిన తెలంగాణా వీరవనిత. వీరు 1919లో జన్మించి 10 సెప్టెంబరు 1985లో పరమపదించారు.1919 లో వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామం లో ఓరుగంటి మల్లమ్మ, సాయిలు కు నాలోగో సంతానంగా చాకలి ఐలమ్మ జన్మించింది. పాలకుర్తి కి చెందిన చిట్యాల నర్సయ్యతో ఐలమ్మ బాల్య వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమారులు ,ఇద్దరు కుమార్తెలు . ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం, చాకలి కులవృత్తే వారికి జీవనాధారం. 1940-44 మధ్య కాలంలో విస్నూర్ లో దేశ్ముఖ్, రజాకర్ల అరాచకాల పై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టింది ఐలమ్మ. అగ్రకులాల స్త్రీలు, దొరసానులు తమను కూడా 'దొరా'అని ఉత్పత్తికులాల (బీసీ కులాల) చేత పిలుపించుకొనే సంస్కృతికి చరమగీతం పాడినవారిలో ఐలమ్మ ముందంజలో ఉన్నారు. దొరా అని పిలువకపోతే ఉన్నతకులాలతో పాటు వారి అనుంగు ఉంపుడుకత్తెలలో కూడా ఉన్న రాక్షస ప్రవృత్తి అనేక పీడన రూపాలలో బయటకు వచ్చేది. వెనుకబడిన కులాల మీద ఆ పీడన రూపాలు విరుచుకుపడేవి. తమను దొరా అని పిలువని ఉత్పత్తి కులాల స్త్రీల మీద తమ భర్తలను ఉసిగొల్పి, దగ్గరుండి ఆఘాయిత్యం చేయించేవారు. ఈ భూమినాది. పండించిన పంటనాది. తీసుకెళ్లడానికి దొరెవ్వడు. నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రె?తాంగ విప్లవాగ్ని చాకలి అయిలమ్మ. మల్లంపల్లి భూస్వామి కొండలరావుకు పాలకుర్తిలో 40 ఎకరాల భూమి ఉండగా ఐలమ్మ కౌలుకు తీసుకుంది. అందులో నాలుగు ఎకరాలు సాగుచేశారు. పాలకుర్తి పట్వారీ వీరమనేని శేషగిరిరావుకు ఐలమ్మ కుటుంబానికి విరోధం ఏర్పడింది. జీడి సోమనర్సయ్య నాయకత్వంలో ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఐలమ్మ ఆ సంఘంలో సభ్యురాలు. పాలకుర్తి పట్వారీ శేషగిరిరావు ఐలమ్మను కుటుంబంతో వచ్చి తన పొలంలో పనిచేయాలని ఒత్తిడి చేయడంతో పనిచేయడానికి నిరాకరించింది. పాలకుర్తి పట్వారీ పప్పులుడకక అయిలమ్మ కుటుంబం కమ్యూనిస్టుల్లో చేరిందని విసునూర్ దేశ్ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశాడు. కేసులో అగ్రనాయకులతో పాటు అయిలమ్మ కుటుంబాన్ని ఇరికించారు. అయినప్పటికీ కోర్టులో తీర్పు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా వచ్చింది.అయిలమ్మ కుటుంబాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తే సంఘం పట్టు కోల్పోతుందని భావించిన దేశ్‌ముఖ్ పట్వారిని పిలిపించుకొని, అయిలమ్మ కౌలుకు తీసుకున్న భూమిని తన పేరున రాయించుకున్నాడు. భూమి తనదని, పండించిన ధాన్యం తనదేనని పంటను కోసుకురమ్మని వందమందిని దేశ్‌ముఖ్ పంపాడు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు వరిని కోసి, వరికట్టం కొట్టి ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. భీంరెడ్డి నరసింహారెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, చకిలం యాదగిరిలు సైతం ధాన్యపు బస్తాలను భుజాలపై మోసారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో ఐలమ్మకు అనుకూలంగా తీర్పువచ్చింది. రజాకార్ల ఉపసేనాధిపతి అయిన దేశ్‌ముఖ్ రెండుసార్లు పరాజయం పాలయ్యాడు. ఐలమ్మ ఇంటిని కూడా తగులబెట్టారు. ధనాన్ని, ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు. ఐలమ్మ కూతురు సోమనర్సమ్మపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఐలమ్మ కుమారులు ముగ్గురు పాలకుర్తి పట్వారీ ఇంటిని కూల్చి అదే స్థలంలో మొక్కజొన్న పంటను పండించారు. అనేక రకాలుగా నష్టపోయినప్పటికీ అయిలమ్మ కుటుంబం ఎర్రజెండాను వీడలేదు. 'ఈ దొరగాడు ఇంతకంటే ఇంక నన్ను ఏవిధంగా నష్టపెట్టగలడు' అని తనలో తాను ప్రశ్నించుకొన్నది.నీ దొరోడు ఏం చేస్తాడ్రా' అని మొక్కవోని ధె?ర్యంతో రోకలి బండ చేతబూని గూండాలను తరమి కొట్టింది. కాలినడకన వెళ్లి దొరకు సవాలు విసిరింది. అయిలమ్మ భూపోరాటం విజయంతో పాలకుర్తి దొర ఇంటిపై కమ్యూనిస్టులు దాడిచేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు. అలాగే 90 ఎకరాల దొర భూమిని కూడా ప్రజలకు పంచారు. అయిలమ్మ భూపోరాటంతో మొదలుకొని సాయుధ పోరాటం చివరి వరకు నాలుగు వేలమంది ఉత్పత్తి కులాల వారు అమరులయ్యారు. 10 లక్షల ఎకరాల భూమి పంపకం జరిగింది. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన అయిలమ్మ సెప్టెంబర్ 10, 1985 న అనారోగ్యంతో మరణించింది.

# అడ్డంగా బుక్కైన నందిగం..



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ గుంటూరు, సెప్టెంబర్ 9 :** ప్రకాశం బ్యారేజ్‌కు కొట్టు కొచ్చి గేట్లను డ్యామేజ్ చేసిన బోట్లపై.. ఏపీ ప్రభుత్వం సీరియస్ అయి విచారణకు ఆదేశించింది. వరద ప్రవాహంలో ఒకేసారి లంగర్లు వేసిఉన్న నాలుగు పడవలు కొట్టుకురావడంపై మొదట్లోనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం దానిపై సీరియస్ అయ్యారు. తాజాగా ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకు విజయవాడ పోలీసులు విచారణ ప్రారంభించారు. అవి ఫెర్రీ ఘాట్ వద్ద ఇసుక రవాణాకు వైసీపీ నేతలు వినియోగించిన బోట్లే అంటున్నారు. ఆ క్రమంలో బోట్లు ఉచ్చు మాజీ ఎంపీ నందిగం మెడకు చుట్టుకునే పరిస్థితి కనిపిస్తుంది.కృష్ణా నదికి ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతికి కొట్టుకొచ్చిన ఇనుప బోట్ల కారణంగా ప్రకాశం బ్యారేజీ గేట్లకు అనుబంధంగా ఉండే కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్నాయి. 64వ నంబరు గేటు వద్ద ఉండే వెయిట్ స్వల్పంగా దెబ్బతినగా.. 69వ గేటు వద్ద ఉండేది పూర్తిగా మధ్యకు విరిగిపోయింది. కాంక్రీట్ సిమెంట్ దిమ్మకు లోపల ఉండే ఇనుప చువ్వలు బయటకు వచ్చేశాయి. ఈనెల 2న కృష్ణా నదికి రికార్డు స్థాయిలో వరద పోటెత్తింది.అప్పుడు కొట్టు కొచ్చిన బోట్లలో ఒకటి 69వ గేటు వద్ద ఉన్న కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టడంతో విరిగిపోయి ఇరుక్కుపోయింది. ఈ బోటును ఢీ కొని మరో రెండు బోట్లు ఆగిపోయాయి. మరో బోటు 64వ నంబరు ఖానా వద్ద ఉన్న కౌంటర్ వెయిట్‌ను ఢీ కొట్టడంతో స్వల్పంగా దెబ్బతింది. ఈ బోటూ అక్కడ ఇరుక్కుపోయింది. ఒకేసారి నాలుగు బోట్లు కొట్టుకురావడంపై మొదట్లోనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం సీరియస్ అయ్యారు.తాజాగా ఆ ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ.. ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేయడంతో.. విజయవాడ వన్ టౌన్ పోలీసులు విచారణ మొదలుపెట్టారు. బోట్ల ఓనర్లని ప్రశ్నించబోతున్నారు. వేసిన లంగర్లు తెంపుకుని పడవలు ఎలా కొట్టుకుని వచ్చి గేట్లను ఢీకొన్నాయనే అంశంపై వివరాలు అడగనున్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఫెర్రీ ఘాట్ నుంచే ఈ బోట్లు కొట్టుకుని వచ్చి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ఆ బోట్లు వైసీపీకి చెందిన వారివే అని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వైసీపీ నేతలు ఇసుక అక్రమ రవాణా కోసం ఆ పడవలు వాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రకాశం బ్యారేజీ గేట్లను బోట్స్ ఢీకొన్న వ్యవహారంలో కుట్ర కోణం దాగి ఉందని.. దానిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకాశం బ్యారేజీని ఢీ కొట్టిన బోట్లు వైసీపీ నాయకులకు చెందినవిగా అనుమానాలు ఉన్నాయన్నారు. ఉద్దేశపూర్వకంగానే బోట్లతో ప్రకాశం బ్యారేజీని ఢీ కొన్నట్లు సమాచారం ఉందన్నారు? ప్రకాశం బ్యారేజిని డ్యామేజ్ చేయడానికి ఉద్దేశపూర్వకంగానే ఒకే చోట ఢీకొనే విధంగా చేశారని మండిపడ్డారు.ఇసుక తోలే హెవీ పడవలను తీసుకొచ్చి వదిలారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. బ్యారేజీని ఢీ కొట్టిన పడవలకు ఎటువంటి అనుమతులు కూడా లేవని తెలుస్తుందని వాటికి వైసీపీ రంగులే ఉన్నాయని బ్యారేజీకి జరగరాని డామేజ్ జరిగి ఉంటే పెద్ద ఉపద్రవం వచ్చేదని దీన్ని చాలా సీరియస్‌గా తీసుకోవాలని వ్యాఖ్యానించారు.మరోవైపు విజయవాడను ముంచెత్తిన బుడమేరు వాగు గండ్లను పూర్తిగా పూడ్చివేశారు . ఇప్పటికే రెండు గండ్లు పూడ్చివేసిన జలవనరుల శాఖ అధికారులు.. తాజాగా మూడో గండిని పూడ్చివేశారు. దీంతో దిగువ ప్రాంతాలకు వరద ప్రవాహం ఆగిపోయింది. అంతకుముందు మంత్రి నారా లోకేశ్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యవేక్షణలో పనులు సాగాయి.బుడమేరు గండ్ల పూడ్చివేత పనులను పర్యవేక్షిస్తూ ఆరు రోజులుగా నిద్రాహారాలు మాని బుడమేరు గట్టుపైనే ఉన్న రామానాయుడు. అక్కడ పని పూర్తవ్వగానే ప్రకాశం బ్యారేజ్ గేట్లకు జరుగుతున్న రిపేర్లను ఆయన పర్యవేక్షించారు. అదలా ఉంటే ప్రకాశం బ్యారేజీ వద్ద గేట్లను ఢీ కొట్టిన పడవుల యజమానుల ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. గొల్లపూడికి చెందిన ఉషాద్రి, సూరాయపాలెం కు చెందిన కోమటి రామ్మోహన్ పడవులుగా గుర్తింపు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎంపీ నందిగం సురేష్ ఆధ్వర్యంలోనే ఈ పడవులు నడిచినట్లు పోలీసులు గుర్తించారు.ప్రస్తుతం నందిగామ సురేష్ ఆధ్వర్యంలో మీ పడవలు నడుస్తున్నయా లేదా అనేది పోలీసులు ఇంకా ధృవీకరించలేదు.. కుట్ర కోణం వెలికి తీసేందుకు విచారణను పోలీసులు వేగవంతం చేస్తున్నారు .. దర్యాప్తు పురోగతిని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మొత్తానికి బోట్లను ఢీ కొట్టిన వ్యవహారాన్ని ప్రభుత్వం సీనియస్‌గా తీసుకోవడంతో అటు బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌తో పాటు మరింత మంది వైసీపీ నేతల చుట్టూ ఉచ్చు గట్టిగానే బిగుసుకుంటున్నట్లు కనిపిస్తుంది.


# తిరుమలలో ఆధార్ ప్రామాణికంగా సేవలు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ తిరుమల, సెప్టెంబర్ 9:** తిరుమలలో శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఆధార్ ప్రామాణికంగా సేవలు అందించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుండి ప్రాథమికంగా అనుమతి లభించిందని టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలో రాష్ట్ర ప్రభుత్వం నుండి వెలువడనుందని వివరించారు. ఫలితంగా దర్శన, వసతి, శ్రీవారి సేవ తదితర సేవలను దుర్వినియోగం చేస్తున్న దళారులను అరికట్టవచ్చని చెప్పారు. అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ?.శ్రీవారి భక్తులకు మరింత పారదర్శకంగా లడ్డూ ప్రసాదాలు అందించాలనే లక్ష్యంతో ఆగస్టు 29వ తేదీ నుంచి దర్శనం టోకెన్ లేని వారికి ఆధార్ తో లడ్డూలను అందించే విధానాన్ని టీటీడీ ప్రవేశపెట్టిందని ప్రకటించారు.?గత కొన్నేళ్లుగా పలువురు దళారులు లడ్డూల బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించాం. తిరుమలలో దళారి వ్యవస్థను అరికట్టి, స్వామివారిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి తగినన్ని లడ్డూలు అందించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, దర్శనం టోకెన్లు లేనివారికి ఆధార్ కార్డుపై రోజువారి రెండు లడ్డూలను మాత్రమే జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. అలాగే చాలా కాలంగా భక్తులు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ, బయట ప్రాంతాలలో ఉన్న టీటీడీ ఆలయాలు, చెన్నై, బెంగళూరు, వెల్లూరులలోని టీటీడీ సమాచార కేంద్రాలలో లడ్డూల డిమాండ్ ఉన్నప్పటికి మేము పంపలేకపోయాము. ప్రస్తుతం పంపిస్తున్నాం. గత నాలుగు రోజుల్లో దాదాపు 75 వేల లడ్డూలు పంపబడ్డాయి" అని ఈవో శ్యామలరావు వివరించారు.తిరుమలలో దర్శనం టోకెన్లు ఉన్న భక్తులకు ఒక ఉచిత లడ్డూతో పాటు, రూ.50/- ప్రాతిపదికన కోరినన్ని లడ్డూలు (స్టాక్ లభ్యత ఆధారంగా) అందజేస్తున్నామని స్పష్టం చేశారు. దీనికి ఆధార్ కార్డు అవసరం లేదన్నారు. ఆవు నెయ్యి నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకు లడ్డూ ప్రసాదాల నాణ్యతను పెంచేందుకు, సువాసన, రంగు, రుచి ఉండే నెయ్యి కొనుగోలు చేసేందుకు ప్రస్తుతం ఉన్న టెండర్ షరతులను అనుసరించి నాణ్యమైన నెయ్యి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. గతంలో కల్తీ నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ పెట్టడం జరిగిందని వెల్లడించారు.కాలినడకన వచ్చే భక్తులకు అలిపిరి పాదాలమండపం వద్ద దివ్యదర్శనం టోకెన్లు జారీ చేయు కౌంటర్లు మరియు గాలిగోపురం వద్ద స్కానింగ్ కౌంటర్లను త్వరలో పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈవో పేర్కొన్నారు. " ?శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుండి 12వ తేదీ వరకు, ముఖ్యంగా అక్టోబర్ 8వ తేదీ శ్రీవారి గరుడసేవను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. ? ?జూన్ నెల మొదటి వారంలో యాత్రికులకు వారానికి 1.05 లక్షల ఎస్ఎస్ డి టోకెన్లు ఇవ్వగా, ఇప్పుడు వారానికి 1.63 లక్షల టోకెన్‌లు జారీ చేస్తున్నాం. ఎస్ఎసడి టోకెన్స్ పెంచిన కారణంగా ఈ టోకెన్ పొందిన భక్తుల నిరీక్షించే సమయం గణనీయంగా తగ్గింది" అని ఈవో ప్రకటించారు.త్వరలో బెంగళూరుకు, హైదరాబాద్ కు చెందిన నిపుణులు తిరుమల లోని వివిధ అన్నప్రసాద కేంద్రాలను సందర్శించనుందని ఈవో తెలిపారు.?అన్నప్రసాద విభాగాన్ని ఆధునికరించడంతో పాటు అన్నప్రసాదాల పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేసే చర్యలు తీసుకుంటామన్నారు.?వీరందించే సూచనల మేరకు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అన్నప్రసాద విభాగాన్ని శాశ్వతంగా సంపూర్ణ స్థాయిలో ఆధునికరిస్తామన్నారు. ?శ్రీవారి భక్తుల నుదుటన పవిత్రమైన "తిరునామం" ధారణ కార్యక్రమం, తిరుమలలోని ముఖ్యమైన ప్రాంతాలలో శుక్రవారం నుండి పునఃప్రారంభిస్తున్నట్లు వివరించారు.

# ఒంటరి మహిళలు జాగ్రత్త..

## ◆ చంపడానికి వస్తున్న లేడీ సైనేడ్ కిల్లర్స్



**క్రైమ్ బ్యూరో పెన్ పవర్ గుంటూరు, సెప్టెంబర్ 9:** గుంటూరు పోలీసులు అరెస్టు చేసిన లేడీ కిల్లర్స్ చేసిన హత్యల గురించి వింటుంటే ఒక్కసారిగా వెన్నులో వణుకు పుడుతుంది. తెనాలిలోని యడ్ల లింగయ్య కాలనీ కి చెందిన ముడియాల వేంకటేశ్వరి అలియాస్ బుజ్జి అనే 32 ఏళ్ల మహిళ తన తల్లి రమణమ్మ మరో కొంతమంది తో కలిసి ఒక గ్యాంగ్ లా ఏర్పడి నాలుగు హత్యలు చేశారు. ఇందులో బుజ్జి అత్తగారు సహా వారికి అప్పు ఇచ్చిన మరో వృద్ధురాలు, షేక్ నాగూర్ బీ అనే పక్కింటావిడను బంగారం డబ్బు కోసం కూల్ డ్రింక్ లో సైనైడ్ కలిపి వేరు వేరు సమయాల్లో చంపేసిన విషయం తెలిసిందే.తెనాలిలో మోషే అనే మరో వ్యక్తిని అతని భార్య సహకారంతో ఇన్సూరెన్స్ డబ్బులో వాటా ఇచ్చేలా మాట్లాడుకుని అతనికి మద్యం లో సైనైడ్ కలిపి తాగించి చంపేశారు. కేసు దర్యాప్తులో ఈ మహిళలు చేసిన వరుస హత్యలు తెలుసుకున్న పోలీసులే షాక్ కు గురయ్యారని గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. అయితే నిజానికి వారు మరో ముగ్గుర్ని కూడా చంపాలని ప్లాన్ చేశారు. కానీ ఆ ముగ్గురు చాలా లక్కీగా చావునుంచి బయట పడ్డారని ఎస్పీ తెలిపారు. థ్రిల్లర్ సినిమా ట్విస్ట్ లను తలపించే ఆ ముగ్గురి డెత్ ఎస్కేప్ ఎలా జరిగిందో మీరూ తెలుసుకోండి.

**1) అన్నంలో సైనైడ్ కలిపి వాలంటీర్‌ను చంపే కుట్ర –** కెమికల్ రియాక్షన్ పుణ్యమా అంటూ చావు నుండి జస్ట్ మిస్‌తెనాలి టౌన్ లో నివసించే అన్నపూర్ణ అనే ఆమె వాలంటీర్ గా పనిచేస్తుంది. గతంలో వాలంటీర్ గా పనిచేసిన ముడియాల వేంకటేశ్వరికి ఆమెతో కాస్త స్నేహం ఉంది. అన్నపూర్ణ ఇంట్లో దాదాపు 1,25,000 (లక్షా ఇరవై ఐదు వేలు) రూపాయల విలువైన బంగారం ఉందని తెలుసుకున్న వేంకటేశ్వరీ అలియాస్ బుజ్జి ఆమె తల్లి రమణమ్మ కలిసి అన్నపూర్ణ తినే ఆహారంలో సైనైడ్ కలిపారు. అన్నపూర్ణ చనిపోయాక ఆమె ఇంట్లో ఉన్న బంగారం తో పాటు అన్నపూర్ణ ఒంటిపై ఉన్న నగలు కూడా కాజేయ్యాలని బుజ్జి ఆమె తల్లి ప్లాన్ చేశారు. కానీ అదృష్టవశాత్తూ అన్నపూర్ణ తినే అన్నంలో కలిపిన సైనైడ్ కెమికల్ రియాక్షన్ కు గురై ఆ రంగు మారిపోయింది.
ఆహారం పాడైంది అనుకుని దాన్ని తినకుండా బయట పారెయ్యడంతో తనకు తెలియకుండానే చావు నుంచి తప్పించుకుంది అన్నపూర్ణ. ఈ సంఘటన 2022 డిసెంబర్ లో జరిగింది.

**2) భర్త ఫోన్ కాల్ రావడం తో చావు నుండి తప్పించుకున్న వరలమది**
తెనాలిలో ఉండే మురగప్ప వరలమది అనే మహిళ తన కూతురు పెళ్లి కోసం బంగారు నగలు చేయించింది. వాటిని కొట్టేయడం కోసం మంచి మాటలతో ట్రాప్ చేశారు బుజ్జి ఆమె తల్లి రమణమ్మ. ఒకరోజు మాట్లాడేపని ఉందని వరలమది నీ ఊరి బయటకు తీసుకెళ్ళారు తల్లీ కూతుళ్ళు. థమ్స్ అప్ లో సైనైడ్ కలిపి తాగించి చంపేయాలని అనుకుంటుండగా వరలమది కి ఆమె భర్త ఫోన్ చేశాడు.
ఆమె తన భర్తకు బుజ్జి,రమణమ్మ లతో కలిసి బయటకు వచ్చానని చెప్పడం విన్న బుజ్జి ఇప్పుడు వరలమది చనిపోతే తమమీద అనుమానం వస్తుందని సైనైడ్ కలిపిన థమ్స్ అప్ ఆమెకు ఇవ్వలేదు. ఇలా భర్త చేసిన ఫోన్ కాల్ భార్య వరలమదిని చావు నుంచి కాపాడింది.

**3) టీలో కలిపిన మత్తు బిళ్ళలు పనిచెయ్యలేదు – బతికి పోయిన మిరాబీ**
తెనాలిలో ఉండే షేక్ మిరాబీ అనే ఆమె దగ్గర ఉన్న 20000 రూపాయలు కాజేసేందుకు ఆమె ఇంటికి వెళ్ళిన బుజ్జి రమణమ్మ ఆమెను మాటల్లో పెట్టి టీలో మత్తు బిళ్ళలు కలిపారు. మిరాబీ మత్తు లోకి వెళ్ళగానే ఆమెకు ఊపిరాడ కుండా చేసి చంపాలని ప్లాన్ చేసారు . అయితే ఆ మత్తు టాబ్లెట్లు పని చేయకపోవడం తో వాళ్ల ప్లాన్ ఫెయిల్ అయింది.
ఇలా బుజ్జి గ్యాంగ్ చేతిలో ఈ ముగ్గురు మహిళలు చావు నుంచి తృటిలో తప్పించుకోగా మిగిలిన నలుగురు మాత్రం తెనాలి లేడీ సైనైడ్ కిల్లర్స్ చేతిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ సందర్భంగా పోలీసులు ఒంటరిగా ఉండే మహిళలు జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా ఎంత పరిచయం ఉన్న వారితోనైనా సరే జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

## నేడు ప్రపంచ ఆత్మహత్యల

# నివారణ దినోత్సవం

## - ఆత్మహత్యలు వద్దు - నిండైన జీవితం ముద్దు




**న్యూస్ డెస్క్ పెన్‌పవర్ :** ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబరు 10న జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ఆత్మహత్యలను నివారణకోసం ప్రజల్లో అవగాహన కలిగించడానికి 2003వ సంవత్సరం నుండి ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది.. ఆత్మహత్యల నివారణ కోసం అంతర్జాతీయ అసోసియేషన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్యలతో కలిసి ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 2003లో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ మొదటి కార్యక్రమంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ 1999లో ప్రపంచ ఆత్మహత్యల నివారణకు చూపిన చొరవ దాని అమలుకొరకు చేసిన ప్రణాళికలకు సంబంధించి ప్రస్తావించబడింది. ఆత్మహత్యకు ముందు ప్రవర్తనల గురించి అవగాహన పెంచడానికి, వాటిని ఎలా సమర్థవంతంగా నిరోధించాలో తెలియజేయడానికి ప్రపంచ, ప్రాంతీయ, జాతీయ బహుళ-రంగ కార్యకలాపాల సంస్థ ఏర్పాటుచేయాలని, ఆ సంస్థ ద్వారా జాతీయ విధానాలు, ఆత్మహత్యల నివారణ ప్రణాళికలను అభివృద్ధి చేయడానికి, అంచనా వేయడానికి దేశాల సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. 2014లో విడుదల చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ మానసిక ఆరోగ్య నివేదిక ప్రకారం, తక్కువ ఆదాయం ఉన్న దేశానికి జాతీయ ఆత్మహత్యల నివారణ ప్రణాళిక లేదని, తక్కువ-మధ్యతరగతి ఆదాయపు దేశాలలో 10% కన్నా తక్కువగా, ఎగువ-మధ్య-అధిక ఆదాయ దేశాలలో దాదాపు మూడవ వంతుగా ఉన్నట్లు నివేదించింది. 2011లో ఒక అంచనా ప్రకారం ఈ సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ 40 దేశాలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాయి. ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాల సందర్భంగా మానసిక వైద్య నిపుణులచే సదస్సులు నిర్వహిస్తారు. ఆత్మహత్యల నివారణ దినోత్సవం గుర్తుగా పసుపు, నారింజ రంగు రిబ్బన్లను చేతులకు కట్టుకుని ఆత్మహత్యలు వద్దు - నిండైన జీవితం ముద్దు అంటూ నినాదాలు చేస్తూ, అవగాహన ర్యాలీ నిర్వహిస్తారు.

# విజయనగరాన్ని వణికిస్తున్న వైరల్ ఫీవర్స్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయనగరం, సెప్టెంబర్ 9:** విజయనగరం జిల్లాలో వైరల్ ఫీవర్స్ వణికిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా విజృంభిస్తున్నాయి. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో నేలంతా చిత్తడిగా మారి పారిశుధ్య సమస్య తాండవిస్తుంది. రోజురోజుకు పెరుగుతున్న జ్వరాలను అదుపు చేయటం వైద్యాధికారులకు సైతం కష్టతరంగా మారింది. రోగుల సంఖ్య అధికంగా ఉండటంతో హాస్పిటల్ లో వైద్య సేవలు సైతం సవాల్ గానే మారాయి.ఉమ్మడి విజయనగరం జిల్లాలో విరుచుకుపడుతున్న విషజ్వరాలు జిల్లా వాసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో ఈ పరిస్థితి మరింత దయనీయంగా మారింది. సాలూరు, పాచిపెంట, మక్కువతో పాటు గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. కొండ ప్రాంతం కావడంతో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంటుంది. కురుస్తున్న వర్షాల కారణంగా దోమల స్వైర విహారంతో జ్వరాలు మరింత పెరుగుతున్నాయి.జిల్లాలో మలేరియా, టైఫాయిడ్ తో పాటు ఇప్పుడు డెంగ్యూ అధికంగా ప్రభలుతుంది. గ్రామాల్లో పారిశుధ్య సమస్య నరకం చూపిస్తుంది. మురుగు కాలువలు, రోడ్లు చిత్తడిగా మారడంతో స్థానికులు దుర్వాసనలతో కాలం గడపాల్సి వస్తుంది. మురుగు నుండి వస్తున్న దోమలు ఏజెన్సీవాసులని నరకం చూపిస్తుంది. దోమకాటుతో మలేరియా, డెంగ్యూ వంటి జ్వరాలు ప్రభలుతున్నాయి.పది రోజుల వ్యవధిలో జియ్యమ్మవలస మండలం బట్టలభద్రలో డెంగ్యూ కారణంగా ముగ్గురు మృత్యువాత పడ్డారు. వారిలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కూతురు మృతి చెందటం అందరినీ కలిచివేసింది. జ్వరాలను అదుపు చేసేందుకు గ్రామాల్లో పలురకాల పారిశుధ్య పనులు చేపట్టినా కురుస్తున్న వర్షాలతో అంతగా ప్రయోజనం ఉండటం లేదు. గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినా జ్వరాలు అదుపులోకి వస్తున్న పరిస్థితులు లేవు. సాధారణ జ్వరం అనుకుని ఇంట్లోనే వైద్య సేవలు పొందితే కొద్ది గంటల్లోనే జ్వరాల తీవ్రత పెరిగి ఆరోగ్య పరిస్థితి విషమించి ప్రాణాల మీదకు వస్తున్న పరిస్థితులు ఉన్నాయి. జ్వరాల కారణంగా పట్టణాల బాట పడుతున్నారు రోగులు.మెరుగైన వైద్యం కోసం కార్పోరేట్ హాస్పిటల్స్ కి వెళితే అక్కడ వేల రూపాయలు ఖర్చు చేయక తప్పని పరిస్థితి నెలకొంటుంది. అక్కడ కూడా రోగుల తాకిడి పెరగడంతో మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు రోగులు. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రులు రోగులతో నిండిపోతున్నాయి. బెడ్స్ కూడా ఖాళీ లేక ఒక్కో బెడ్ పై ఇద్దరు, ముగ్గురు రోగులు ఉంటున్నారు. సెలైన్ బాటిల్స్ పెట్టాలన్నా వైద్యులకు అవస్థలు తప్పడం లేదు. జ్వరాల ఉధృతితో జిల్లాలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది

# రూరల్ మండలంలో ఆకలి కేకలు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయవాడ, సెప్టెంబర్ 9:** విజయవాడ నగరాన్ని బుడమేరు వరద ముంచెత్తి వారం రోజులైంది. ఇప్పుడిప్పుడే వరద ముంపు కాస్త తగ్గుతున్నా ఇంకా లక్షలాది ప్రజలు వరదల్లోనే చిక్కుకుపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారం రోజులుగా విజయవాడ కలెక్టరేట్‌లోనే ఉంటూ వరద సహాయ చర్యల్ని పర్యవేక్షిస్తున్నారు. వరద ముంపుకు గురైన డివిజన్‌లకు ప్రత్యేకంగా ఓ ఐఏఎస్ అధికారిని నియమించి సహాయ చర్యల్ని పర్యవేక్షిస్తున్నారు. సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు వరద సహాయక చర్యలు కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం అయ్యాయి.గత ఆదివారం నుంచి విజయవాడ పాతబస్తీలోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ నియోజక వర్గంలోని పలు డివిజన్లను ప్రభుత్వ యంత్రాంగం విస్మరించింది. వరద సహాయక చర్యలన్నీ సింగ్‌నగర్‌వైపు కేంద్రీకృతం అయ్యాయి.
బుడమేరు తీవ్రతను గుర్తించిన తర్వాత నగరంలోని అన్ని ప్రాంతాలకు వరద సాయాన్ని విస్తరించారు.వెలగలేరు దిగువున బుడమేరు డైవర్షన్ ఛానల్ కాల్వలకు గండి పడటంతో వరద ప్రవాహం నగరాన్ని ముంచెత్తింది. విజయవాడకు వెలుపల కవులూరు, పైడూరుపాడు, శాంతినగర్ జక్కంపూడి, వేమవరం, వైఎస్సార్ కాలనీ, అంబాపురం, నున్న వంటి ప్రాంతాలు పూర్తిగా మునిగిపోయాయి. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో విజయవాడ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నా ఇవన్నీ గ్రామ పంచాయితీలుగానే ఉన్నాయి. బుడమేరు వరద సహాయక చర్యలన్నీ విజయవాడలోనే కేంద్రీకృతం కావడంతో గ్రామీణ ప్రాంతాలకు బయట నుంచి సరుకులు కూడా అందడం లేదు. ప్రధానంగా అంబాపురం, పాతపాడు, జక్కంపూడి, షాబాద్, కొత్తూరు-తాడేపల్లి వంటి గ్రామాలు విజయవాడ నగరానికి వెలుపల ఉంటాయి.
విజయవాడ నగరంలో భాగమే అయినా పంచాయితీలుగా ఉండటంతో బుడమేరు వరద సహాయక చర్యలు వారం దాటినా ఈ గ్రామాలకు చేరలేదు. విజయవాడ-కొత్తూరు తాడేపల్లి ప్రధాన రోడ్డు ఇంకా వరద ముంపులోనే ఉంది.జక్కంపూడి వైఎస్సార్ కాలనీ వరకే ప్రభుత్వ సహాయక చర్యలు అందుతుండటంతోదానికి ఎగువున ఉన్న గ్రామాలు బిక్కుబిక్కు మంటూ ఉన్నాయి. పాముల కాల్వ నుంచి కొత్తూరు వెళ్లే గ్రామంలో వేమవరం గ్రామంలోకి సైతం వరద ముంచెత్తింది. కొత్తూరు-వెలుపల ఉన్న చెరువు పొంగడంతో దాని సమీపంలో ఉన్న ఇళ్లలో వారిని స్థానికంగా ఉన్న సెయింట్ బెనెడిక్ట్ పాఠశాలలో నిర్వాహకులు ఆశ్రయం కల్పించారు. స్థానిక టీడీపీ నాయకులు బాధితులకు ఆహారం అందిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో గ్రామాలకు వరద సాయం అందుతుందని భావించినా ఇప్పటి వరకు ఎలాంటి సాయం రాలేదని కొత్తూరు తాడేపల్లి గ్రామస్తులు తెలిపారు.విజయవాడ నగరంతో రాకపోకలు తెగిపోవడంతో గ్రామాల్లో ఉండే సరుకులు కూడా నిండుకున్నాయి.
నిత్యావసర వస్తువులు కూడా తెచ్చుకునే పరిస్థితులు లేవని, కూరగాయలు కూడా లేవని గ్రామస్తులు చెబుతున్నారు. విజయవాడ నగరంలో అద్దెల్ని భరించలేక చాలామంది రూరల్ గ్రామాల్లో నివాసం ఉంటున్నారు. నిత్యం ఉపాధి కోసం నగరంలోకి వచ్చే వారికి ఎనిమిది రోజులుగా వరద ముంపు కష్టాలు తప్పడం లేదు. విజయవాడ నగరంలో సహాయ చర్యలు అందుతున్నా బుడమేరు వరద ముంపుకు మొదట గురైన గ్రామాలను కూడా ఆదుకోవాలని రూరల్ గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'ఒలింపిక్స్‌కు అర్హత సాధించాకే మాట్లాడండి'..

# విమర్శకులకు సైనా కౌంటర్



ఒలింపిక్ విజేతగా ఓ వెలుగు వెలిగిన భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ ఈ మధ్య తరచూ వార్తల్లో నిలుస్తోంది. ఆరేండ్లుగా అంతర్జాతీయ పోటీలకు దూరమైన సైనా తాను ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడుతున్నాని ఈమధ్యే చెప్పింది. అంతకంటే ముందు 'భారత్‌లో క్రికెట్‌కు ఉన్న ఆదరణ చూస్తే అసూయ వేస్తోంది' అంటూ ఆమె విమర్శల పాలైంది. అప్పటి నుంచి ఎవరోఒకరు సైనాను సోషల్ మీడియాలో టార్గెట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె విమర్శకులకు గట్టి కౌంటర్ ఇచ్చింది.ఈమధ్య కొందరు సైనా నెహ్వాల్ ప్రతిభను, కష్టాన్ని తక్కువ చేస్తూ మాట్లాడతున్నారు. పారిస్ ఒలింపిక్స్ సమయంలో కొందరు 2012 ఒలింపిక్స్‌లో కాంస్య పతకం ఆమెకు అదృష్టవశాత్తూ.. బహుమతిగా దొరికిందంటూ సోషల్ మీడియాలో పిచ్చి పిచ్చి కామెంట్లు పెడతున్నారు. దాంతో, చిర్రెత్తుకొచ్చిన సైనా వాళ్లకు గట్టిగా బుద్ధి చెప్పాలనుకుంది. 'ముందుగా ఒలింపిక్స్ పోటీలకు అర్హత సాధించండి. ఆ తర్వాత నన్ను విమర్శించండి' అంటూ ఆమె సవాల్ విసిరింది. సైనా నుంచి ఊహించని స్పందన రావడంతో విమర్శకుల నోళ్లకు తాళం పడినట్టు అయింది. దాదాపు ఆరేండ్లుగా ఆటకు దూరమైన సైనా ఈ మధ్య రాష్ట్రపతి భవన్‌లో ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము తో సరదాగా బ్యాడ్మింటన్ ఆడింది. అనంతరం 'మై స్టోరీ %-% హర్ స్టోరీ' సిరీస్‌లో ఆమె పలు విషయాలు మాట్లాడింది. అయితే.. క్రికెట్‌పై ఆమె చేసిన వ్యాఖ్యలు ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి. బ్యాడ్మింటన్ బదులు టెన్నిస్ ఆడి ఉంటే బాగుండు అని తనకు అప్పుడప్పుడు అనిపించేదని సైనా అంది.అంతేకాదు 'టెన్నిస్, బ్యాడ్మింటన్ కంటే క్రికెట్ ఏమంత కష్టమేమీ కాదు. మనదేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ చూస్తే అసూహ వేస్తుంది. ఎందుకంటే.. క్రికెట్‌కు మాత్రమే క్రేజ్ ఉంటే భారత్ క్రీడా దేశం ఎలా అవుతుంది?. ఒలింపిక్స్‌లో చైనాతో పోటీ పడి పతకాలు ఎలా గెలవగలం' అని అంది.

# చంద్రుడిపై భారత్, పాకిస్థాన్ మ్యాచ్.. ఎందుకంటే?





ప్రపంచ క్రికెట్‌లో కొన్ని మ్యాచ్‌లు గొప్ప సమరంగా చరిత్రలో నిలిచిపోతాయి. వాటిలో భారత్, పాకిస్థాన్ మ్యాచ్ ఒకటి. అందుకనే చిరకాల ప్రత్యర్థులు మైదానంలో దిగితే చూడాలని అభిమానులు ఆశగా ఎదురుచూస్తారు. చిరకాల ప్రత్యర్థులు 'నువ్వానేనా' అన్నట్టు తలపడుతుంటే అభిమానులు కంటి రెప్ప కూడా వాల్చరు. అయితే.. గత కొంత కాలంగా భారత్, పాక్ జట్ల మధ్య మ్యాచ్‌లు బొత్తిగా తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో పాక్ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.చంద్రుడిపై ఆడినా సరే.. ఇండో -పాక్ మ్యాచ్‌పై ఉండే క్రేజ్ మాత్రం తగ్గదని అజ్మల్ అన్నాడు. వచ్చే ఏడాది పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనున్న చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు ఆడుతుందా? లేదా? అనేది ఇంకా స్పష్టం కాలేదు. ఈ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకున్న అజ్మల్.. 'భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ సంబంధాలు మెరుగుపడాలని ఆకాంక్షించాడు.

భారత్, పాక్ జట్ల మధ్య ఎక్కువ మ్యాచ్‌లు జరగాలి. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు నిర్వహించాలి. ఎందుకంటే.. రెండు దేశాల మధ్య ఎంతో ప్రేమ ఉంది. ఒకవేళ భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌లను చంద్రుడిపై పెట్టినా సరే.. ఇసుమంత కూడా ఆదరణ తగ్గదు' అని తెలిపాడు.

**2012-13లో చివరి సిరీస్..** సరిహద్దు వివాదాల కారణంగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు రద్దయ్యాయి. దాంతో, ప్రస్తుతానికి ఐసీసీ టోర్నీల్లోనే దాయాది జట్లు తలపడుతున్నాయి. ఇరుజట్ల మధ్య 2012-13లో చివరి ద్వైపాక్షిక సిరీస్ జరిగింది. ఇక.. భారత జట్టు చివరిసారిగా 2008లో పాకిస్థాన్ గడ్డపై కాలు మోపింది. అప్పటినుంచి భద్రతా కారణాల వల్ల టీమిండియాను పంపేందుకు బీసీసీఐ ఇష్టపడడం లేదు.నిరుడు ఆసియా కప్ కోసం పాకిస్థాన్‌కు వెళ్లేది లేదని బీసీసీఐ సెక్రటరీ జై షా తేల్చిచెప్పాడు. దాంతో, దిగొచ్చిన ఐసీసీ.. ఆసియా కప్‌ను హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించింది. ఇప్పుడు పాక్ గడ్డపై జరుగబోయే చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఒకవేళ టీమిండియా వెళ్లకుంటే టోర్నీని యూఏఈకి తరలిస్తారనే వార్తలు ప్రచారమవుతున్నాయి.

# పంత్ అత్యుత్తమ టెస్టు ఆటగాడు.. అతడు చేయాల్సింది ఒక్కటే..!



భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ మళ్లీ టెస్టు జెర్సీ వేసుకోబోతున్నాడు. కారు యాక్సిడెంట్ కారణంగా ఏడాదిన్నర తర్వాత టెస్టు జట్టుకి ఎంపికైన అతడు బంగ్లాదేశ్‌పై సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు.



ఇక సుదీర్ఘ ఫార్మాట్‌లో ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయగల పంత్‌పై మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'నా దృష్టిలో పంత్ టెస్టుల్లో అత్యుత్తమ ఆటగాడు' అని దాదా అన్నాడు.

'నా దృష్టిలో భారత అత్యుత్తమ టెస్టు ఆటగాడు పంత్. సుదీర్ఘ ఫార్మాట్‌లో అతడు నిజంగా ఆల్‌టైమ్ గ్రేట్. అయితే.. అతడు గతంలో మాదిరిగా తన దూకుడును కొనసాగిస్తేనే బెస్ట్ బ్యాటర్ అవుతాడు. ఇక.. పంత్ వన్డేల్లో, టీ20ల్లో మరింత మెరుగవ్వాల్సి ఉంది. అతడిలో చాలా ప్రతిభ ఉంద. రాబోయే రోజుల్లో పంత్ భారత దేశపు అత్యుత్తమ ఆటగాడు అవుతాడని నా ప్రగాఢ నమ్మకం' అని గంగూలీ తెలిపాడు. అంతేకాదు బంగ్లాదేశ్‌తో తొలి టెస్టుకు ఎంపికైన స్క్వాడ్‌లో ప్రధాన పేసర్ షమీ లేకపోవడంపై దాదా స్పందించాడు. 'గాయం నుంచి కోలుకుంటున్న షమీ బంగ్లా సిరీస్‌కు దూరం అయ్యాడనేది నాకు తెలుసు. అయితే.. అతడు త్వరలోనే జట్టులోకి వస్తాడు. ఎలాగూ ఆస్ట్రేలియా పర్యటన ఉందిగా. షమీ జట్టుతో కలిస్తే పేస్ బౌలింగ్ యూనిట్ ప్రమాదకరంగా మారుతుంది. ఇక బెంగాల్ పేసర్ ఆకాశ్ దీప్విషయానికొస్తే.. అతడొక అద్భుతమైన యువ పేసర్. వేగంగానే కాదు ఎక్కువ స్పెల్స్ బౌలింగ్ చేయగల సత్తా అతడికి ఉంది.

అతడు బెంగాల్ తరఫున ఆడడం..

వికెట్లు తీయడం నేను చూశాను. సిరాజ్, షమీల మాదిరగానే ఆకాశ్ కూడా 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయగలడు' అని గంగూలీ వెల్లడించాడు. భారత జట్టు గొప్ప కెప్టెన్లలో ఒకడైన గూంగూలీ వీడ్కోలు అనంతరం బీసీసీఐ అధ్యక్షుడిగా సేవలందించాడు. ప్రస్తుతం దాదా ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ఫ్రాంఛైజీకి డెరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా కొనసాగుతున్నాడు. ఇదే జట్టుకు రిషభ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.





## కోలీవుడ్‌లో మహిళల రక్షణకు ఓ కమిషన్

**తిరువనంతపురం, పెన్‌పవర్ సెప్టెంబర్ 9:** మలయాళ చిత్రపరిశ్రమలో నటీమణులపై వేధింపులకు సంబంధించి జస్టిస్ హేమ కమిటీ ఇచ్చిన నివేదిక దేశ్యాప్తంగా అలజడి రేగింది. దీంతో తమిళ చిత్ర పరిశ్రమ ముందస్తు చర్యలు చేపట్టింది. కోలీవుడ్‌లో మహిళల రక్షణకు ఓ కమిషన్ ఏర్పాటు చేసింది సౌత్ ఇండియన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ నడిగర్ సంఘం. ఈ కమిటీకి నటి రోహిణిని అధ్యక్షురాలిగా నియమించింది.నడిగర్ సంఘం 68వ జనరల్ కౌన్సిల్ సమావేశం ఆదివారం చెన్నైలోని కామరాజర్ అరంగంలో జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించారు. జనరల్ కౌన్సిల్ సమావేశంలో నడిగర్ సంఘం అధ్యక్షుడు విశాల్, కోశాధికారి నాసర్, కార్తీతోపాటు పలువురు పాల్గొన్నారు. తమిళ చిత్ర పరిశ్రమలో మహిళలపై వేధింపులకు సంబంధించి ఫిర్యాదు అందిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, నటుడు విశాల్ తెలిపారు. రోహిణి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేశామన్నారు. రోహిణీతోపాటు మరో నటి సుహాసిని ఈ కమిటీలో కీలకంగా వ్యవహరిస్తారని చెప్పారు. నడిగర్ సంఘంలో సభ్యత్వం లేని వారైనా సరే... ఎలాంటి సమస్య ఎదుర్కొన్నా ఫిర్యాదు చేయొచ్చని అన్నారు. సీనియర్ యాక్టర్, కొత్త నటుడు, దర్శకుడు, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్.. ఇలా ఎవరిపై ఫిర్యాదు వచ్చినా... తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపుల సమస్యను చాలా సీరియస్‌గా తీసుకున్నామని అన్నారు నడిగర్ సంఘం ప్రెసిడెంట్, నటుడు నాజర్. అందుకే కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కమిటీలో న్యాయవాదులు కూడా ఉంటారన్నారు. ఇది తమ తొలి అడుగు అని చెప్పారు నాజర్. ఇండస్ట్రీలో పనిచేసే మహిళలకు ఒక నమ్మకాన్ని కలిగిస్తున్నామన్నారు. జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తమకు ఎదురైన వేధింపుల గురించి నటీమణులు ధైర్యంగా బయటకు వచ్చి మాట్లాడుతున్నారు. ఈ అంశంపై నటి రోహిణి కీలక వ్యాఖ్యలు చేశారు. లైంగిక వేధింపుల గురించి మీడియా ముందు మాట్లాడొద్దని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయకుండా... మీడియా ముందు మాట్లాడటం వల్ల ఎలాంటి ప్రయాజనం ఉండదన్నారు. ఇక.. 2019 నుంచి నడిగర్ సంఘంలో అంతర్గత కమిటీ పని చేస్తోంది కానీ... అంత చురుకుగా లేదు. దీంతో... రోహిణి అధ్యక్షత కమిటీని నియమించారు. మహిళలు ఫిర్యాదులు చేసేందుకు ముందుకు రావాలని రోహిణి కోరారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్లు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నేరస్తులపై ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తారు. బాధితులకు న్యాయ సహాయం అందేలా చూస్తామని నాడిగర్ సంఘం తెలిపింది. మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులు, వేధింపులను తెలుపుతూ... జస్టిస్ హే కమిటీ... ఒక నివేదికను తయారు చేసి కేరళప్రభుత్వానికి అందించింది. పనితీరు, రెమ్యునరేషన్, సాంకేతి రంగంలో మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపై కమిటీ అధ్యయనం చేసింది. క్యాస్టింగ్ కౌచ్ మొదలు.. వివక్ష వరకు మాలీవుడ్‌లో మహిళలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రిపోర్టులో పేర్కొంది. ఈ రిపోర్ట్ దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో... నటీమణులు బయటకు వచ్చి... తమకు ఎదురైన చేదు అనుభవాలు, వేధింపులను వెల్లడిస్తున్నారు. ఈ క్రమంలో... ప్రముఖ మలయాళ దర్శకుడు రంజిత్, నటుడు జయసూర్య, మణియన్ పిల్లరాజుపై కేసులు కూడా కేసులు నమోదయ్యాయి. మాలీవుడ్ తరహాలోనే... ఇప్పుడు కోలీవుడ్‌లో కూడా మహిళలపై వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేకంగా కమిటీని నియమించింది నడిగర్ సంఘం.

# తమన్నా.. ఇప్పటికే 2సార్లు బ్రేకప్ అయిందట..



స్టార్ హీరోయిన్ తమన్నా.. అటు నార్త్.. ఇటు సౌత్ లో వరుస అవకాశాలు అందుకుని దూసుకుపోతున్న విషయం తెలిసిందే. తెలుగు, తమిళ భాషలతో పాటు హిందీలో కూడా నటిస్తోంది. మంచు మనోజ్ శ్రీ మూవీతో టాలీవుడ్ కు పరిచయమైన మిల్కీ బ్యూటీ.. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన హ్యాపీ డేస్ సినిమాతో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోకుండా సినీ ఇండస్ట్రీలో అదరగొడుతోంది అమ్మడు. డైరెక్టర్ సుందర్ సి తీసిన బాక్ మూవీలో యాక్ట్ చేసింది. సూపర్ స్టార్ రజనీకాంత్ జైలర్ మూవీలో కావాలయ్యా అంటూ అదరగొట్టింది. గ్లామర్ షోతో ఫిదా చేసింది. రీసెంట్ గా వచ్చిన స్త్రీ 2లో ఐటెం సాంగ్ చేసి టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న ఓదెల-2 షూటింగ్ స్టేజ్ లో ఉంది. ఇప్పటికే ఆ మూవీ నుంచి రిలీజ్ అయిన తమన్నా పోస్టర్లు.. మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. కొన్ని నెలలుగా బాలీవుడ్ నటుడు విజయ్ వర్మతో రిలేషన్ షిప్ లో ఉన్న విషయం తెలిసిందే. లస్ట్ స్టోరీస్ వెబ్ సిరీస్ టైమ్ లో వారిద్దరూ ప్రేమలో పడ్డారు. ఈ విషయాన్ని వాళ్లే పలుమార్లు తెలిపారు. అయితే రిలేషన్ షిప్ విషయంలో తనకు కొన్ని బ్యాడ్ ఎక్స్పీరియన్స్ లు ఉన్నాయని తమన్నా తాజాగా తెలిపింది. తన లైఫ్ లో రెండు బ్రేకప్ స్టోరీస్ ఉన్నాయని చెప్పింది. పలు కారణాల వల్ల వర్కౌట్ అవ్వలేదని, అందుకే అలా అయిందని పేర్కొంది. అప్పుడు చాలా బాధపడ్డానని చెప్పింది. ఒక పర్సన్ కోసం తన లైఫ్ వదులుకోవడం నచ్చలేదని పేర్కొంది. అందుకే బ్రేకప్ చెప్పుకున్నట్లు వెల్లడించింది. తాను జీవితంలో ఏదైనా కొత్తగా సాధించాలనుకుంటానని తెలిపింది. ఫస్ట్ బ్రేకప్ జరిగిన కొన్ని నెలల తర్వాత మరో వ్యక్తితో మూవ్ అయ్యానని చెప్పింది. కానీ అతడు కూడా తనకు సెట్ కాదని అనిపించిందని తమన్నా తెలిపింది. ముఖ్యంగా ప్రతి చిన్న మ్యాటర్ కు అబద్ధం చెప్పే వాళ్లంటే తనకు నచ్చదని తెలిపింది. అలాంటి వారికి దూరంగా ఉండాలని ఎప్పుడూ అనుకుంటానని చెప్పింది. అందుకే ఆ వ్యక్తితో రిలేషన్ షిప్ కంటిన్యూ చేస్తే చాలా డేంజర్ అని భావించినట్లు వెల్లడించింది. అలా ఆ పర్సన్ తో లవ్ కహానీ ముగిసిపోయిందని తెలిపింది. మొత్తానికి తన లైఫ్ లో రెండు బ్రేకప్ స్టోరీలు ఉన్నట్లు వెల్లడించింది. కానీ విజయ్ వర్మతో డేటింగ్ విషయంపై స్పందించలేదు.

## దేవర జోరు కోసం హిందీలో ఆ ఇద్దరు



యంగ్ టైగర్ ఎన్టీఆర్ దేవర మూవీ సెప్టెంబర్ 27న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్ షురూ చేశారు. అందులో భాగంగా సెప్టెంబర్ 10న ముంబై వేదికగా దేవర ట్రైలర్ ని రిలీజ్ చేయబోతున్నారు. ట్రైలర్ రిలీజ్ ని పెద్ద ఈవెంట్ గా నిర్వహించబోతున్నారు. ఆర్ఆర్ఆర్ తో వచ్చిన క్రేజ్ ని నెక్స్ట్ లెవల్ కి తీసుకొని వెళ్లాలని తారక్ అనుకుంటున్నాడు. ఇదిలా ఉంటే ఈ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో ఎన్టీఆర్, జాన్వీ కపూర్, సైఫ్ అలీఖాన్ పాల్గొననున్నారు. అలాగే చిత్ర యూనిట్ మొత్తం పార్టిసిపేట్ చేయనున్నారంట. ట్రైలర్ తో సినిమాపై అంచనాలు అమాంతం పెరుగుతాయని భావిస్తున్నారు. ఎన్టీఆర్ కెరియర్ లో ఆర్ఆర్ఆర్ తర్వాత సెకండ్ హైయెస్ట్ బడ్జెట్ మూవీగా దేవర తెరకెక్కుతోంది. ఇదిలా ఉంటే ఈ సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూ కోసం బాలీవుడ్ స్టార్స్ ని రంగం లోకి దించుతున్నారంట. ఆర్ఆర్ఆర్ సినిమాలో అలియా భట్ హీరోయిన్ గా నటించింది. ఈ షూటింగ్ సమయంలో ఎన్టీఆర్ తో అలియా భట్ కి మంచి బాండింగ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో దేవర సినిమా ప్రమోషనల్ ఇంటర్వ్యూ కోసం అలియా భట్ వస్తోందంట. అలాగే బడా నిర్మాత కరణ్ జోహార్ కూడా దేవర మూవీ హిందీ ప్రమోషన్స్ ని దగ్గరుండి చూసుకుంటున్నారంట. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ తో పాటు దేవర ప్రమోషనల్ ఇంటర్వ్యూలో కరణ్ జోహార్, అలియా భట్ పాల్గొంటారంట. అలియా భట్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ ని ఇంటర్వ్యూ చేస్తుందంట. కరణ్ జోహార్, అలియా భట్ కి బాలీవుడ్ లో క్రేజ్ ఉంది.వీరిద్దరూ దేవర సినిమా ప్రమోషన్స్ లో పార్టిసిపేట్ చేస్తే కచ్చితంగా అది హిందీ మార్కెట్ లో ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. అయితే ముందుగా దేవర ట్రైలర్ కచ్చితంగా బాలీవుడ్ ఆడియన్స్ కి రీచ్ అవ్వాలి. అలా అయితే కరణ్, అలియా చేసే ప్రమోషన్స్ ప్లస్ అవుతాయి. ఇప్పటి వరకు దేవర నుంచి వచ్చిన సాంగ్స్ అయితే హిందీలో కూడా మంచి ఆదరణ సొంతం చేసుకున్నాయి. జాన్వీ కపూర్, సైఫ్ అలీఖాన్ స్టార్ ఇమేజ్ కూడా దేవరకి ప్లస్ అయ్యే ఛాన్స్ ఉందని ట్రేడ్ పండితులు భావిస్తున్నారు. దేవర ట్రైలర్ రిలీజ్ కి ఇంకా ఒక్క రోజు మాత్రమే గడువు ఉంది. ఈ ట్రైలర్ కోసం తారక్ ఫ్యాన్స్ ఎగ్జైటింగ్ తో ఎదురుచూస్తున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com